విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

శుక్రవారం, 31 అక్టోబర్ 2025 | 8 పేజీలు

రైతులకు అండగా ఉందాం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: వ్యవసాయ మార్కెట్ పాలక వర్గం వ్యవసాయ రైతులకు అండగా నిలబడి మార్కెట్ అభివృద్ధికి కృషి చేద్దాం అని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి పేర్కొన్నారు. గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగిన వైస్ చైర్మన్,మరియు డైరెక్టర్ల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటి అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఛైర్మెన్ తో పాటు డైరెక్టర్ల తో సుధీర్ఘంగా చర్చించారు. వ్యవసాయ మార్కెట్ కు ఆదాయం వచ్చే విధంగా గతంలో కొనసాగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్ పోష్టులను కొనసాగిద్దాం అని చర్చించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయానికి నేమ్ బోర్డు, కార్యాలయ ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను తొలగించడానికి కృషి చేద్దామని నిర్ణయం తీసుకున్నారు. వ్యవసాయ రైతులు పండించే పండ్ల తోటల వద్దకు పార్మేషన్ రోడ్లు నిర్మాణం కోసం ప్రతి పాదనలు ఇవ్వాలని ఎమ్మెల్యే డైరెక్టర్లను ఆదేశించారు. ..మిగతా 2లో

తుఫాను బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

- సహాయ సేవలలో ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: తుఫాను బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లాలో తుఫాను ప్రభావం వల్ల దెబ్బతిన్న ప్రాంతాలలో ఆయన ఇంచార్జ మంత్రి ఫరూక్, కావలి శాసన సభ్యులు కావ్య కృష్ణారెడ్డితో కలసి కావలి పట్టణం ఒకటవ వార్డు, మద్దూరు పాడు లోని టిడ్కో గృహాలలో ఏర్పాటుచేసిన పునరా వాస కేంద్రంలో సహాయక సేవలు అందించారు. ఈ సందర్భంగా తుఫాను బాధితులకు 25 కేజీల బియ్యము అలాగే తక్షణ ఆర్థిక సాయంగా రూ. 3 వేల నగదును పంపిణీ చేశారు. ..మిగతా 2లో

గ్రంథాలయానికి రానున్న మాజీ ఉపరాష్ట్రపతి

- ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాటు పూర్తి చేయండి - జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: నవంబర్ 2 తేదీ జరిగే బ్రౌన్ శాస్త్రి శతజయంతోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సిపి బ్రౌన్ గ్రంథాలయానికి రానున్న నేపథ్యంలో ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ నందు జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బ్రౌన్ శాస్త్రి శతజయంతోత్సవ వేడుకలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరు కానున్న నేపథ్యంలో అధికారిక ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేసీ అదితి సింగ్, ఎస్పీ విశ్వనాథ్‌లు పాల్గొన్నారు. ..మిగతా 2లో

- నేడు జాతీయ ఐక్యత దినోత్సవం

ఐకమత్యమే మహాబలం

ఐకమత్యమే మహాబలమని సమగ్రతకు చిహ్నమని సర్దార్ వల్లభాయ్ పటేల్ నిరూపించారు. జాతీయ ఐక్యత దినోత్సవం - ఐక్య భారతానికి ప్రతీక. భారత దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలిచిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని దేశవ్యాప్తంగా అక్టోబర్ 31వ తేదీన జాతీయ ఐక్యత దినోత్సవంగా జరుపుకుంటారు. స్వాతంత్ర్యానంతరం సంస్థానాలను ఏకతాటిపైకి తెచ్చి "ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియా"గా ఖ్యాతి గడించిన పటేల్ గారి సేవలను స్మరించుకుంటూ అన్ని రాష్ట్రాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో అధికారులు, విద్యార్థులు 'రన్ ఫర్ యూనిటీ')లో పాల్గొని దేశ సమగ్రతకు తమ కట్టుబాటును తెలియజేస్తారు. అధికారులు, ఉపాధ్యాయులు పటేల్ కృషి భారత చరిత్రలో అపూర్వమైన ఘట్టమని వివరిస్తారు. స్వాతంత్ర్యం అనంతరం 562 సంస్థానాలను భారత్‌లో విలీనం చేయడం ద్వారా పటేల్ గారు నిజమైన దేశ సమైక్యతకు మార్గదర్శకుడయ్యారని వారు పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో నేటి యువత దేశ ఐక్యత, అభివృద్ధి దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పటేల్ ఆశయాలను నిలబెట్టుకోవడం ప్రతి భారతీయుని బాధ్యత అని అధికారులు తెలిపారు. ఒక భారత్ - శ్రేష్ఠ భారత్ నినాదాలతో ముందుకువెళ్దాం.

- విశాలాంధ్ర-పులివెందుల

రామా.. కనవేమిరా..!

- దేవునికే శఠగోపం..
- కోదండ రామా.. నీ భూమి కబ్జా..
- 2009లో ప్రైవేటు వ్యక్తి చేతుల్లోకి..
- న్యాయస్థానంలో ఆలయ భూమిగానే తీర్పు..
- కాపాడాలని తహసిల్దార్‌కు వినతి..

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: మన పూర్వీకులు దేవాలయాలను నిర్మించి వాటి నిర్వహణ నిమిత్తం భూములను దేవుళ్ళ వశం చేయడం జరిగింది. ఈ భూముల నుండి వచ్చే రాబడితో దూప దీప నైవేద్యాలకు వినియోగించడంతో పాటు పురోహితులకు జీతభత్యాలు చెల్లించడం, అవి పోగా మిగులు ఉంటే ఇతరత్రా ఉత్సవాలకు ఖర్చు చేసేవారు. కాలక్రమంలో చాలా మటుకు ఆలయాల భూములను కొందరు స్వార్థపరులు కబ్జా చేయడం మనం చూస్తున్నాం. సాక్షాత్తు దేవుళ్ళ ఆస్తులకే రక్షణ కరువైన నేటి రోజుల్లో కొందరు మరీ బరితెగిస్తున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి..ఆ కోవలోనే మండల పరిధిలోని తిప్పలూరు గ్రామంలో వెలసిన శ్రీ కోదండ రామాలయ భూమి వస్తుంది. పూర్వం దేవాలయ నిర్వహణ కోసం సుంకేసుల గ్రామ సర్వే నెంబరు250 లో తనకు ఉన్న ఒక ఎకరా 22 సెంట్ల భూమిని సానేపల్లె లక్ష్మ మమ్మ అనే మహిళ విరాళంగా అందజేసింది. అయితే విలువైన ఆ భూమిని కాజే చేసే ఉద్దేశంతో కొందరు ప్రయత్నం చేశారు. కె.రామ మోహన్ రెడ్డి అనే వ్యక్తి 2009లో ఆన్‌లైన్‌లో ఈ భూమిని తన పేరుపై నమోదు చేసుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. అప్పట్లో కొంతమంది రెవెన్యూ అధికారులు, సిబ్బంది అతడికి సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. విషయం తెలుసుకున్న వెంటనే గ్రామస్తులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి భూమి ఆలయానికి చెందిందే నన్న తీర్పును కూడా పొందారు. కానీ ఇప్పటికీ సదరు భూమి ఆన్ లైన్‌లో కె.రామమోహన్ రెడ్డి పేరు మీదనే కనిపిస్తుండడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తహసిల్దార్‌కు ఫిర్యాదు.!

ఈ భూమి వ్యవహారంపై గురువారం ఆలయ నిర్వాహకులు పేర్ల గంగాధర్ రెడ్డి లిఖితపూర్వకంగా మండల తహసిల్దార్ శోభన్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఆలయ భూమిని పరిరక్షించాలని ఆ వినతిపత్రంలో కోరారు. న్యాయస్థానం తీర్పు మేరకు కబ్జాదారుడి కబంధహస్తాల నుండి ఆలయం పేరున నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన తాహసిల్దార్ క్షేత్రస్థాయి పరిశీలన చేసి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

పరిశుభ్రతే ప్రామాణికం

- మెరుగైన వైద్యం అందించాలి - కలెక్టర్ నిశాంత్‌కుమార్

విశాలాంధ్ర-పెద్ద తిప్పసముద్రం: ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశుభ్రత పాటించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలో గురువారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించాడు. బూర్లపల్లి జెడ్పి ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించాడు. ఆ తరువాత పిటిఎం ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పరిసర ప్రాంతాలను పరిశీలించి శుభ్రంగా ఉంచాలని, రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యాధికారిని ఆదేశించారు. వైద్యం కోసం వచ్చిన రోగులతో వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ప్రసవాలు జరుగుతున్నాయని వైద్యున్ని ప్రశ్నించారు. ఆసుపత్రిలో ప్రసవాలు ప్రోత్సహించాలని సూచించారు. ఆసుపత్రి రికార్డును పరిశీలించిన అనంతరం రక్తపరీక్షల కేంద్రాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. మలేరియా, టీబీ రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీరాములునాయక్, ఎంఈవో నారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

అమరవీరుల త్యాగాలు మరువలేనివి: సిఐ

విశాలాంధ్ర-ముద్దనూరు: శాంతిభద్రతల పరిరక్షణకు విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని సిఐ దస్తగిరి అన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సిఐ దస్తగిరి బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పక పాటించాలి: ఎస్ఐ

విశాలాంధ్ర-వీరబల్లి: ప్రతి వాహనదారుడు నిబంధనలు తప్పక పాటించాలని ఎస్సై నరసింహారెడ్డి అన్నారు గురువారం వీరబల్లి రాయచోటి రహదారి సాయిబాబా ఆలయ సమీపంలో ముమ్మరంగా వాహనాలు తనిఖీ నిర్వహించారు పర్మిట్ లైసెన్స్ లేని వాటికి అపరాధ రుసుము విధించారు. అదేవిధంగా ప్రతి వాహన దారునికి కూడా నిబంధనలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా బైక్‌లో వెళుతూ ఫోన్ మాట్లాడితే కఠినమైన చర్యలు ఉంటాయన్నారు ప్రతి వాహనదారునికి కూడా లైసెన్స్ తప్పకుండా ఉండాలన్నారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్ఎండి షఫీ నాయక్ పేర్కొన్నారు. గురువారం ఆయన అన్నమయ్య జిల్లా వీరేరు నందు జరిగిన జిల్లా మార్కెట్ యార్డ్ చైర్మన్‌ల సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా మార్కెట్ యార్డుల అభివృద్ధి, రైతులకు కల్పించాల్సిన మెరుగైన సదుపాయాలు,పారదర్శక వ్యవస్థపై చర్చ నిర్వహించారు. రైతుల ఉత్పత్తులపై సరైన గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకుంటామని రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు.

నీటి సరఫరా పునరుద్ధరణ

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: పట్టణంలో 14వ వార్డులోని కొత్త కుమ్మరి వీధిలో మోటర్ కాలిపోయి వార్డులోని ప్రజలకు నీటిసమస్య ఎక్కువ ఉండడంతో వార్డులోని ప్రజలు మేజర్ పంచాయతీ సర్పంచి యనమల సుధాకర్ దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించి కొత్త మోటరు కొత్త పంపు తెప్పించి నీటి సరఫరా పునరుద్ధించాడు. వార్డులోని ప్రతి కులాయికి నీరు రావడంతో సర్పంచ్ సుధాకర్‌కి వార్డులోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్సవాలు ఐకమత్యానికి ప్రతీకలు

విశాలాంధ్ర-నందలూరు: మండలంలోని నందలూరు పంచాయతీలో వెలసిన మగ్దూం బాబా ఉరుసు మహోత్సవం హిందూ ముస్లింల ఐక్యతకు నిదర్శనమని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం దర్గాలో నిర్వహించిన గంధం మహోత్సవానికి వారు హాజరై పూల చాందర్ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పీఠాధిపతి మైనుద్దీన్ హుసేని వారిని పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిన్న పీఠాధిపతులు అఖిల్ సాహెబ్, హైదర్ హుసేని, మండల కన్వీనర్ సిద్దవరం గోపిరెడ్డి, మహిళా మండలి అధ్యక్షురాలు పల్లె మాధవి,

వైయస్ఆర్సీపీ నాయకులు గొబ్బిళ్ళ త్రినాధ్, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి,గుండు మల్లికార్జున రెడ్డి, కరిముల్లా ఖాన్, నడివీధి సుధాకర్, శ్రీధర్, అనుదీప్ జయసింహా, గుణ యాదవ్, ఇబ్బు, సోమిశెట్టి ప్రభాకర్, నాగ సుబ్బయ్య, అజీజ్, కాకి చంద్ర, భాస్కర్ యాదవ్, అరిగె నాని, నాగసుబ్బయ్య, మధురాజు, మా భాష, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్, మూడు చక్రాల వాహనం ఇప్పించండి

విశాలాంధ్ర-సుండుపల్లె: మూడు చక్రాల బండి, పెన్షన్ ఇప్పించి మా కుటుంబాన్ని ఆదుకోండి అని మండల కేంద్రానికి సమీపంలోని జీకే రాచపల్లికి చెందిన ఇనాయతుల్లా గురువారం ప్రభుత్వాన్ని వేడుకున్నారు. గత పది సంవత్సరాల క్రితం డ్రైవర్ పని మీద కువైట్ కి వెళ్లి ప్రమాదశా వత్తు అక్కడ పనిచేస్తుండగా యాక్సిడెంట్లో రెండు కాళ్ళు పూర్తిగా సచ్చుపడ్డాయి. 90శాతం వైకల్యం కలిగి ఉండి కు

టుంబాన్ని పోషించలేక ఇబ్బందులు పడుతు న్నామని వేడుకున్నారు. తిరుపతి వేలూరు వంటి ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న ఫలితం లేకుండా పోయిందని, కుటుంబానికి ఆసరా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భార్య,ఒక కుమార్తె ఉన్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని వేడుకున్నారు.

సొసైటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తా

- సింగిల్ విండో చైర్మన్ బెల్లాల రమణ - సుండుపల్లె సొసైటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-సుండుపల్లె: నూతనంగా ఎన్నికైన సింగల్ విండో చైర్మన్ బెల్లాల రమణయ్య సొసైటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.సుండుపల్లె సింగిల్ విండో అధ్యక్షుడిగా బెల్లాల రమణయ్య, గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు డైరెక్టర్లుగా మాలేపాటి సురేష్ నాయుడు, పెద్ద సిద్దయ్యలు సొసైటీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం నిర్వహించారు.సొసైటీ సిబ్బంది సంతకాలు చేయించి ప్రమాణం చేయించారు. అనంతరం వారిని పూలమాలలు, శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుండుపల్లె సొసైటీ పరిధిలోని ప్రజలకు అందుబా టులో ఉంటూ సేవలందిస్తామని, సొసైటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పాలకవర్గ సభ్యులు అన్నారు. తమ

ఎంపికకు కృషి చేసిన రాజంపేట తెదేపా ఇన్చార్జి చమర్తి జగన్మోహన్రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్ప,ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివ రామనాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ మోహన్ బాబు నాయుడు, ఎల్ఫి రమణ, కిరణ్ నాయుడు, చంద్రమౌళి, జనసేన మహిళా నాయకురాలు రెడ్డి రాణి, భాజపా అసెంబ్లీ కన్వీనర్ రామా జగదీష్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ అంశాన్ని ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర-పులివెందుల: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలన్న ఉపసంహరించుకోవాలని వైసిపి మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణ పరిధిలోని 4వ వార్డులో వైసిపి అధినేత జగ్, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల ఆదేశాల మేరకు కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ చేసే ఏర్పడే సమస్యల పై ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటామని వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ వైర్మెన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పట్టణ అధ్యక్షులు హాల్ గంగాధర్ రెడ్డి, రసూల్, స్థానిక నాయకులు ఫైర్ రామకృష్ణ ఈశ్వరయ్య, సుబ్బారాయుడు, చల్లా పెద్ద వెంకటేష్, నవీన్, హరి, అంజి, రామమోహన్,రాజు, యూత్ నాయకులు కిరణ్, ప్రశాంత్, విష్ణు, భరత్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో...

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం వైసిపి అధినేత జగన్, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు, విద్యార్థులు కూడా స్వచ్ఛందగా కార్యక్రమంలో పాల్గొన్నట్లు వైసిపి విద్యార్థి విభాగం అధ్యక్షులు రాము, కోశాధికారి రాఘవేంద్రారెడ్డి తదితరులు వెల్లడించారు.

రైతులకు అండగా ఉందాం: ఎమ్మెల్యే

మొదటి పేజీ తరువాయి

జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. ఈ రహదారి వలన వ్యవసాయ మార్కెట్‌కు మంచి రోడ్డు సౌకర్యం లభిస్తుంది అందరం కలసి అభివృద్ధి చేద్దాం అని సర్పంచ్ దార్ల చంద్రశేఖర్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి దృష్టికి తీసుకుపోతానని ఎమ్మెల్యే తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ గత పాలకవర్గానికి, ప్రస్తుత పాలకవర్గానికి మార్పు తీసుకొద్దామని డైరెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ సెక్రెటరీ బాబు, వ్యవసాయ శాఖ ఎడిఎ ఎస్ మణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లు, జనసేన నాయకులు పగడాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి రానున్న మాజీ ఉపరాష్ట్రపతి

మొదటి పేజీ తరువాయి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చేరుకొని మాట్లాడుతూ.. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు జిల్లాకు రానున్న నేపథ్యంలో ఆయన పర్యటనకు సంబంధించి అధికారిక ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో సిపి బ్రౌన్ ప్రాంగణం నందు నిర్వహించనున్న గ్రంథాలయ సాహిత్య సేవా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన నవంబర్ రెండో తేదీన పాల్గొంటారని తెలిపారు. ప్రధానంగా స్వాగత ఏర్పాట్లు, కాన్వాయ్, బస ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అలాగే కాన్వాయ్‌లో కచ్చితంగా 108 వాహనం,మెడికల్ సిబ్బంది ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఆయన బసచేస్తున్న ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ వద్ద మెడికల్ టీం ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. శానిటేషన్ సంబంధిత అంశాలను పర్యవేక్షించాలని కడప మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే ప్రోటోకాల్ ప్రకారం వెహికల్స్ ఏర్పాటు చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. సాధారణ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి అంశాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే అధికారులందరూ జానమద్ది సాహితీ పీఠం వారితో సమన్వయం చేసుకుంటూ, ప్రోటోకాల్ ప్రకారం అవసరమైన అన్ని ఏర్పాట్లను ఖచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, ఆర్డీవో జాన్ ఇర్విన్, కడప కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా సమాచార శాఖ అధికారి పద్మజ, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తుఫాను బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తుఫాను ప్రభావం వల్ల జరిగిన పంట నష్టం, ఆస్తి నష్టం తదితర వాటిపై అంచనా వేసి తగిన పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు మంత్రులు, సీనియర్ అధికారులను ప్రభావిత ప్రాంతాలకు పంపారన్నారు. తుఫాను బాధితులకు నాణ్యమైన ఆహారం, వైద్య సదుపాయాలు అందించాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారన్నారు. ఈ విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-సిద్దవటం: పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి సిబ్బంది కృషి చేయాలని కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ సూచించారు. సిద్దవటం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం పిజిఆర్ఎస్‌పై రెవిన్యూ సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన ఫిర్యాదు దారులతో చరవాణిలో మాట్లాడారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు రెవిన్యూ శాఖ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే గోల్డెన్ రికార్డ్స్, రీసర్వే పై సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. రీసర్వే జరుగుతున్న

గ్రామాలలో గ్రామసభలు నిర్వ హించి రైతులకు రీసర్వే పట్ల సర్వేయర్లు అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్ ఆకుల తిరుమలబాబు, డిప్యూటీ తహసీల్దార్ మాధవి లత, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, మండల సర్వేయర్ సోమశేఖర్, విఆర్ఓలు పాల్గొన్నారు.

ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యం: డీసీసీబీ చైర్మన్

విశాలాంధ్ర-అట్లూరు: రాష్ట్రంలో నెల కొన్న తీవ్ర తుపాను పరిస్థితుల దృష్ట్యా, ప్రభుత్వం ప్రజల రక్షణకు అత్యంత ప్రాధాన్య తనిస్తూ పటిష్ట చర్యలు చేపట్టిందని ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి బద్వేల్ ఎన్జీవో కాలనీ మంచూరు నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. ప్రజల ప్రాణాల రక్షణే ప్రభుత్వానికి ప్రథమ కర్తవ్యమని ఆయన ఉద్ఘాటించారు. ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఇప్పటికే అవసరమైన చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. తుపాను హెచ్చరికలు రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ యంత్రాంగాన్ని వెంటనే అప్రమత్తం చేశారు. అదేవిధంగా, మంత్రులు, ప్రజా ప్రతినిధులందరూ ప్రజలకు అండగా నిలవాలని సీఎం పిలుపునిచ్చారు. ఈ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల శాసనసభ్యులు,

తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలుతో సహా ప్రజా ప్రతినిధులు వెంటనే ప్రజల్లోకి వెళ్లి బాధితులకు అండగా నిలబడి సహాయక చర్యలను పర్యవేక్షించారన్నారు. ప్రభుత్వ యంత్రాంగం 24గంటలూ శ్రమిస్తూ సహాయక చర్యలు చేపట్టారన్నారు. మొంథా తుపానును ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేశారని మంచూరు సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

– సిపి రమణారెడ్డి

విశాలాంధ్ర-మైదుకూరు: మైదుకూరు పట్టణం లోని మేధా కళాశాల ఆవరణలో కాలేజీ విద్యార్థులతో సమావేశంలో మాట్లాడుతున్న సిఐ రమణారెడ్డి గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అలాగే సోషల్ మీడియా, ఇంటర్నెట్, మొబైల్ (అధునాతన ఆయుధాలు) లను ఎక్కువ ఉపయోగించరాదని, ట్రాఫిక్‌పై అవగాహన కల్పించడం అయినది. ఈ సమావేశం లో మేధా కళాశాలల డైరెక్టర్ నరసింహులు, ప్రిన్సిపల్ రాజా రెడ్డి పాల్గొన్నారు.

రీ సర్వేతో సమస్యలు పరిష్కారం

- ప్రభుత్వం పునరావాసం కింద 400 ఎకరాలు కేటాయించింది
- రెవెన్యూ రికార్డులో ఆస్తులు మాయం
- సరిహద్దులను గుర్తించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడండి
- రాజంపేట జాయింట్ కలెక్టర్ హెచ్ఎస్ భావన

విశాలాంధ్ర-సుండుపల్లె: సరిహద్దులను గుర్తించి ప్రజలకు రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని రాజంపేట జాయింట్ కలెక్టర్ హెచ్ఎస్ భావన పేర్కొన్నారు. గురువారం ముడుంపాడు పంచాయతీలోని యర్రపురెడ్డి ఆదినారాయణ రెడ్డి జలాశయం పింఛా ప్రాజెక్ట్ నిర్మించేందుకు1954లో అనుమతులు వచ్చాయి. ఈ ప్రాంతంలో పాత గొందిపల్లి ఉండేదని ఈ గ్రామంలో నివసించే ప్రజల నుండి పట్టా భూములను 60 సంవత్సరాల క్రితం 300 ఎకరాలను ప్రజల నుండి ప్రభుత్వం తీసుకొని ప్రాజెక్టు నిర్మాణం చేపట్టే క్రమంలో పునరావాసం కింద 1972లో అప్పటి గోపాలకృష్ణన్ అనే కలెక్టర్ మా గ్రామస్తులకు ఫారెస్ట్ అటవీ భూమిని ఒక్కో కుటుంబానికి నివాసం ఉండేందుకు 10సెంట్లు భూమి తోపాటు 5 ఎకరాలు చొప్పున 400 ఎకరాలను కేటాయించినట్లు మా పూర్వీకులు తెలిపారని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కల్లె రెడ్డెప్ప తెలిపారు. అదే క్రమంలో రెవెన్యూ భూమిని అటవీ శాఖకు ఇచ్చి ఉంటారని అయితే రెవెన్యూ రికార్డులో పాత గొందిపల్లి ప్రజలకు పునరావాసం కింద ప్రభుత్వం కేటాయించిన 400ఎకరాల భూమి ఆర్ఓఆర్ లో లేకపోవడంతో ప్రభుత్వం చేపడుతున్న భూ రి సర్వేలో (రిజర్వుడ్ ఫారెస్ట్) లో ఉన్నట్లు తేలడంతో రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్ భావన, రాజంపేట డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ గురవయ్య, అన్నమయ్య జిల్లా ఏడి భరత్‌కుమార్, తాహసిల్దార్ మెహబూబ్ చాంద్,అన్నమయ్య జిల్లా సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, సబ్ డిఎఫ్ఓ శ్రీనివాసులు, రేంజర్ వై.సిరెడ్డిలు సంయుక్తంగా ప్రజలకు కేటాయించిన 400 ఎకరాల సరిహద్దు రాళ్ళను పరిశీలించి, ముడుంపాడు గ్రామంలో రెవెన్యూ భూమిని కలిపేందుకు ప్రత్యేక పరికరాలతో సర్వేర్లు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ హెచ్ ఎస్ భావన స్వయంగా పరిశీలించి గోపాల కృష్ణాపురం గ్రామ ప్రజలకు రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది ప్రజలు రైతులు పాల్గొన్నారు.

న్యూస్ రీల్

లక్ష్మిరెడ్డికి నివాళి

విశాలాంధ్ర-వేంపల్లి: కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగం రామకృష్ణారెడ్డి సోదరుడు వెలమవారిపల్లెకు లక్ష్మిరెడ్డి అనారోగ్యంతో బుధవారం స్వర్గస్తులయ్యారు. రాజ్యసభ మాజీ సభ్యులు ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి ,కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి ,ఉత్తన్న ,ఐచర్ రమణ , చిన్నకోట్ల నాగరాజు గురువారం లక్ష్మిరెడ్డి భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. లక్ష్మి రెడ్డికుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మిరెడ్డి ఆత్మకు ప్రశాంతిని ప్రసాదించాలని ప్రార్థించారు.

గండిని పూడుస్తున్న సర్పంచ్

విశాలాంధ్ర-పెద్దమండ్యం: మండలంలోని బండమీద పల్లి పంచాయతీలో కొట్టేవాళ్ళపల్లి దగ్గర కొత్తచెరువుకు గండిపడి చెరువుకు అవతలి వైపున మట్టి నీటిలో చెల్లాచెదురుగా కొట్టుకుపోతుంటే దానిని నివారించడానికి సర్పంచ్ భయ్యారెడ్డి జెసిబి సహాయంతో చెరువు మరువను తగ్గించి మరో మార్గం ద్వారా నీటిని పోవడానికి జెసిబి గ్రామ ప్రజల సహాయంతో దానిని నివారించడానికి ప్రమాదమని తెలిసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌తో పాటు ప్రజలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-బద్వేలు: నియోజకవర్గంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతూ హాస్పిటల్ ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కొందరికి సీఎం సహాయ నిధి నుండి ఆర్థిక సాయం అందించమని అభ్యర్థించగా అభ్యర్థనను మన్నించి సీఎం సహాయ నిధి నుండి ఆర్థిక సాయం చేస్తూ పంపించిన 14,77,428 విలువైన చెక్కులను బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ స్థానిక టిడిపి కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

విద్యుత్ షాక్‌తో రైతుకు తీవ్రగాయాలు

విశాలాంధ్ర-వేంపల్లి: విద్యుత్ షాక్‌తో ఓ రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన కడప జిల్లా చక్రాయపేట మండలం ఎర్ర బొమ్మన పల్లె గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రబొమ్మన పల్లె గ్రామంలో నా నారాయణ అనే రైతు సన్ననిమ్మ (పులుసు నిమ్మ) సాగు చేస్తున్నాడు. ఈ క్రమములో నిమ్మ తోటకు నీరు అందించేందుకు పొలం వద్ద విద్యుత్ మోటార్ ఆన్ చేస్తున్న సమయంలో షాక్ తగిలింది. నీతో కాలికి పెద్ద గాయం అయింది. అదే సమయంలో కొంతమంది వ్యక్తులు ఫీజు కట్ చేయడంతో ప్రాణాపాయం తప్పింది. రైతు నారాయణ ప్రాణాలతో బయటపడడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు గ్రామస్తులు వైద్య చికిత్స కోసం వేంపల్లి ఆసుపత్రికి తరలించారు.

50సంవత్సరాలైనా సీసీ రోడ్లు వేయరా

- పాలకులకు ఆ గ్రామంపై అంత చిన్నచూపు ఎందుకో
- సురాయి పల్లె వాసులకు భూములు చూపించరా
- అధికారులకు సిపిఐ సూటి ప్రశ్న

విశాలాంధ్ర-అట్లూరు: మండలంలో సూరాయ పల్లి గ్రామం వెలసి 50సంవత్సరాలైనా, ఇప్పటికీ ఆ ఊరికి ప్రధాన దారికి, సీసీ రోడ్డు వేయకపోవడం దుర్మార్గమని సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానియేల్ మండిపడ్డారు. గురువారం సురాయిపల్లి గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఇమ్మానియేలు మాట్లాడుతూ, అట్లూరు మండలం, మాడుపూరు పంచాయతీ , సూరాయపల్లి గ్రామం, గత 50 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న, ఇప్పటివరకు ప్రధాన రహదారికి సీసీ రోడ్డు వేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ గ్రామంలో దాదాపుగా 70 బీసీ పేద కుటుంబాలు జీవిస్తున్నారని, మన్యంవారిపల్లె వద్ద నుండి సూరాయి పల్లెకు పోవుటకు ప్రధాన రహదారి కిలోమీటర్ పైన ఉంటుందని, ఈ దారి గత వైసిపి ప్రభుత్వంలో సిసి రోడ్డు సాంక్షన్ అయినప్పటికీ, స్థానిక నాయకులు అడ్డుకున్నారని గ్రామస్తులు చెప్తున్నారు. అంతేకాకుండా ఈ గ్రామ ప్రజలకు 40 కుటుంబాలకు ఒకటిన్నర ఎకరా చొప్పున సాగుభూమి కేటాయిస్తూ వారికి పాస్ బుక్కులు మాత్రమే ఇచ్చారని, పట్టాలు ఇవ్వలేదని ఏదో మొక్కుబడిగా ఐదారు మందికి భూములు చూపించారు తప్ప, ఇప్పటివరకు మిగిలిన వారికి ఎవరికీ చూపించలేదని వారి భూమి ఎక్కడ ఉందో వారికే తెలియదు అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు, పాలకులు స్పందించి ప్రధాన రహదారి అయిన,మన్యం వారి పల్లె వద్ద నుండి సూరాయపల్లె వరకు సిసి రోడ్డు వేయించి, వారి భూములు వారికి చూపించాలన్నారు, లేనిపక్షంలో గ్రామస్తులతో, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ అట్లూరు మండల కార్యదర్శి శేషారెడ్డి నాయకులు సుబ్బారెడ్డి, శీను,వెంకటేష్ ,గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

విశాలాంధ్ర-మైలవరం: స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రభుత్వం అందించే రుణ సౌకర్యాలను అందిపుచ్చుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని మండల ఏపిఎం వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం ఉదయం మండల కేంద్రములోని మండల సమాఖ్య కార్యాలయంలో సమైక్య అధ్యక్షురాలు రాజేశ్వరి అధ్యక్షతన సమైక్య వార్షిక సభ సమావేశం నిర్వహించినట్లు వెలుగు శాఖ ఏపిఎం వెంకట రమణ తెలిపారు. ఏపీఎం మాట్లాడుతూ అన్ని గ్రామ సమాఖ్యలు ఆదాయంలో ఉన్నాయని, గత సంవత్సరం మొదటి స్థానంలో వద్దిరాల గ్రామ సమైక్య- 3 రూ. 1,28,325లతో నిలవగా, రెండవ స్థానంలో వేపరాల గ్రామ సమైక్య- 3, మూడో స్థానంలో వేపరాల గ్రామ సమైక్య-2 నిలిచాయన్నారు. మండల సమైక్య 2024 25 సంవత్సరానికి రూ.6,21,749 ఆదాయం పొందిందని తెలిపారు. అనంతరం మండల సమైక్య ఆఫీస్ బేరర్స్ ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షురాలుగా రాజేశ్వరి, కార్యదర్శి ఉమాదేవి, కోశాధికారి సౌజన్య ఎంపికయినట్లు తెలిపారు. ఏపీయంలు వెంకటసుబ్బయ్య, నాగేంద్రబాబు, సీసీలు రెహానా బీబి, షాబిరూన్, బాల కంబయ్య, అయ్యన్న పాల్గొన్నారు.

వడ్డెర ఓపన్న విగ్రహానికి భూమి పూజ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: నగరంలోని 3వ డివిజన్ నందు ఉన్న కడప తిరుపతి బైపాస్, వైఎస్ఆర్ విగ్రహం సర్కిల్ నందు గురువారం వడ్డెర ఓబన్న విగ్రహ భూమి పూజను తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి చేశారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సహచరుడైన వడ్డెర ఓబన్న ను తెలుగుదేశం పార్టీ గుర్తించి జిల్లాలో ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని ఇదే వడ్డెర సంఘస్తులకు గొప్ప అవకాశమని ఆయన తెలిపారు. ఈ విగ్రహాన్ని ఒక నెలలోనే నెలకొల్పి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలిపించే త్వరలోనే ప్రారంభం చేస్తామని వడ్డెర సంగస్తులకు ప్రభుత్వము అన్ని విధాల ఆదుకుంటుందని ఆయన తెలిపారు. త్వరలోనే వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి అసెంబ్లీలో చర్చించి ఒక నిర్ణయాన్ని ప్రభుత్వం తెలుపుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం గౌరవ అధ్యక్షులు జానకిరామ్, డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు దేరంగుల శ్రీను, సింహాద్రి, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత పాఠశాలలకు పట్టిపీడిస్తుందా

విశాలాంధ్ర-చిట్వేలి: మండలంలో పాఠశాల ఆలనా పాలనపై ప్రత్యేక దృష్టి ఉన్న ఉపాధ్యాయుల కొరత పట్టిపీడిస్తుందా అంటే పీడిస్తుందని మాట విద్యార్థుల తల్లిదండ్రుల నోట వినబడుతుంది. గురువారం, మండల పరిధిలోని నక్కల పల్లె గ్రామపంచాయతీలో ఆ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పరిస్థితి ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు నెలల నుండి ఒకే ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండడంతో 31మంది ఉండే పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. విసిగిపోయిన తల్లిదండ్రులు పాఠశాలకు తాళాలు వేసి బైఠాయించారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఇక్కడ ఉండాల్సిందేనని ఉన్నత స్థాయి అధికారులకు పలుమార్లు చెప్పిన ప్రయోజనం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని గ్రామంలోనే పాఠశాల ఉండడం మాకు వరంలా భావించామని విద్య అన్న అక్షర పదానికి మంచి మంత్రి కూడా ఉన్నాదులేని ఆనందపడ్డామని గత ఐదు సంవత్సరాల నుండి ఉపాధ్యాయులతో విసిగిపోయామని కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధ్యాయులను ఏర్పాటు చేస్తే ఇద్దరు వచ్చారులేని ఆనందపడ్డాము మా పిల్లలందరిని బడిలో చేర్చాం. తీరా నాలుగు నెలల నుండి ఒకే ఉపాధ్యాయులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారని ప్రక్కనే ఉన్న చిల్లవాళ్ళ పల్లె, ప్రాథమిక పాఠశాలలో 6మంది పిల్లలు ఉన్నారని. వారు కూడా మా పిల్లలతో సమానమే కానీ ఇక్కడున్న ఉపాధ్యాయుని తీసి అక్కడ పెట్టడం సమస్య పెరుగుతుందే తప్ప పరిష్కారం అవుతుందా అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తేనే మా పిల్లలను పాఠశాలకు పంపిస్తామని అందుకోసమే విసిగిపోయి బయట ఉంచామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి: సీపీఐ

విశాలాంధ్ర-కలసపాడు: తుఫాను వలన దెబ్బతిన్న పంటలకు ప్రతి ఎకరాకు నష్టపరిహారం ఇవ్వాలని కలసపాడు సిపిఐ మండల కార్యదర్శి గుడిమే సునీల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొంథా తుఫాను కారణంగా గత ఐదు రోజులుగా కురుస్తున్నటువంటి వర్షం కలసపాడు మండలంలోని అన్ని గ్రామాలలో ఎక్కువగా వరి టమోటా మొక్క జొన్న పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన అన్నారు. దెబ్బతిన్న పంటలకు వెంటనే ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇవ్వాలి అని ఆయన డిమాండ్ చేశారు. రామాపురం. తంబళ్లపల్లె సింగరాయపల్లె తెల్లపాడు బ్రాహ్మణ పల్లె రాజుపాలెం పుల్లారెడ్డి పల్లె. ముదిరెడ్డిపల్లె లింగారెడ్డి పల్లె గ్రామాలలో మొక్కజొన్న తడిసి మొలకలు వచ్చాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి. ప్రతి రైతు కూడా న్యాయం చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

జగన్‌ను కలిసిన నాయకులు

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కా ర్యాలయంలో కలిసినట్లు ఎర్రగుంట్ల మండ లం మాలపాడు గ్రామానికి చెందిన ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల వీర భాస్కర్ రెడ్డి తెలిపారు. తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలతో పాటు రైతులకు సంబంధించిన వాళ్ళు సమస్యలను జగన్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు భాస్కర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల పక్షాన పని చేయడం ద్వారా పార్టీ బలోపేతానికి కష్టపడాలని జగన్ సూచించినట్లు భాస్కర్ తెలిపారు.

పరిసరాలు
పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: నగరంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు తగు చర్యలు చేపట్టాలని, నగరం సుందరీకరణగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కడప నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి అన్నారు. గురువారం నగర పరిశీలనలో భాగంగా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్, సీపీ బ్రౌన్ లైబ్రరీ నందు విజిట్ చేయడం జరిగింది. మాజీ భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కడపకు వస్తున్న సందర్భంగా ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ నందు పరిసరాలు నీట్‌గా ఉండేలాగా చూసుకోవాలని సంబంధిత సానిటరీ ఇన్స్పెక్టర్ అధికారికి ఆదేశాలు ఇచ్చారు.

చెకుముకి సైన్స్ సంబరాలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు మండల స్థాయి పరీక్షలకు సంబంధించి ముఖ్య నిర్ణయం తీసుకోవడం జరిగిందని. జన విజ్ఞాన వేదిక - కడప జిల్లా కార్యదర్శి శివరాం తెలిపారు. నవంబర్ 1వ తేదీకి బదులుగా 4వ తేదీ (సోమవారం) 10:00గంటలకు నిర్వహించాలని ఆదేశించడం జరిగిందన్నారు.

ప్రజా చైతన్య
కార్యక్రమాలలో విద్యార్థులు

విశాలాంధ్ర-కడప: నాగార్జున మహిళ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో యూనిట్-2 పరిధిలో 47 మంది వాలంటీర్లు నిరంజన్ నగర్‌లో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్. శ్రావణి నిరంజన్ నగర్ గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహించి, ఆరోగ్య జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మొదట నాగార్జున డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ర్యాలీగా పక్కీరుపల్లికి వెళ్లి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అసలే ధర లేదు.. ఆపై అధిక వర్షాలు..

- తుఫాను దెబ్బతో ఉల్లి రైతుల దింపుడు కల్లం ఆశ కూడా అడియాసే
- ఆత్మహత్యలు శరణ్యం అంటూ వాపోతున్న రైతులు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం
- నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి సిపిఐ డిమాండ్

విశాలాంధ్ర-తొండూరు: ప్రభుత్వ నిర్లక్ష్యంతో పకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న ఉల్లి రైతులను ఆదుకోవాలని మండలంలోని ఉడవగండ్ల, సంతకోవూరు, ఇనగలూరు, కృష్ణంగారిపల్లె ప్రాంతాల్లో తుఫానుకి ప్రభావితమైన పరిశీలించిన సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి రాములు మాట్లాడుతూ ఇప్పటిదాకా గిట్టుబాటు ధర లేక అల్లాడిపోయిన ఉల్లి రైతుల కష్టాలు పుండు మీద కారం చల్లినట్టు మొంత తుఫాను ఉల్లి రైతుల ఆశలపై వర్షం నీటిని చల్లింది ఆరుగాలం శ్రమించి ఎకరాకు దాదాపు లక్ష రూపాయల వరకు ఖర్చు చేసి మద్దతు ధర లేకపోయినా మధ్యలో ఆపలేక కాపాడుకుంటూ వచ్చిన పంట నీళ్ల పాలయ్యింది కనీసం కూలి కూలి ఖర్చులకు మందుల ఖర్చులకు పెట్టిన పెట్టుబడి తిరిగి వచ్చే పరిస్థితి లేదని గతంలో ప్రభుత్వం మద్దతు ధర క్వింటా 1200 రూపాయలుగా ప్రకటించినప్పటికీ జిల్లాలో ఇప్పటివరకు ఒక్క కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన పాపాన పోలేదన్నారు జిల్లాలో దాదాపు 18 వేల ఎకరాలకు పైగా సాగు చేసిన ఉల్లి రైతుల కష్టాలు ప్రభుత్వానికి ఏమాత్రం చెవికెక్కట్లేదని నష్టపోయిన ఉల్లి రైతులను గుర్తించడంలో కూడా ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని అప్పులు చేసి లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి మాకు ఉన్నదారి ఆత్మహత్యలే అంటున్న ఉల్లి రైతుల కన్నీళ్లకు ఇప్పటికైనా నిద్రపోతున్న ప్రభుత్వం మేలుకొని ఎకరానికి లక్ష రూపాయలు పంట నష్టం కింద ప్రకటించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో ఉల్లి రైతులతో ఆందోళన రాష్ట్ర సచివాలయ గేట్లు తాకుతుందని హెచ్చరించారు ఉల్లి రైతులు సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు

పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: పోరుమామిళ్ల శివారులో మలకత్తువ దగ్గర బెల్లగోడి కాలువ, ద్వారా రంగసముద్రం, చెరువుకు నీరు వెళ్లకుండా పూడిక తీయకపోవడం, తూములకు అడ్డుకట్ట మట్టి వేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్,మండల కార్యదర్శి రవికుమార్, లు అధికారులపై ఆగ్రహం చెందారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ మొంథ తుఫాను కారణంగా పోరుమామిళ్ల చెరువు నుండి వరద నీరు మల్లకతువ చేరి కిందికి ప్రవహించే క్రమంలో అధికారులకు నిర్లక్ష్యానికి నిదర్శనం మారింది. పంటకాలువకు అడ్డు కట్టను వేయడం వలన పంట కాలువ తెగి పొలాల పైకి రాళ్ళు మట్టి వెళ్లడం జరిగింది కనుక బెల్లగోడి కాలువ పూడిక తీసి ఉంటే ఈరోజు రాష్ట్రంలో ఉన్న చెరువులన్నీ నిండిన. రంగసముద్రం చెరువులోకి బెల్లగోడి కాలు ద్వారా నీరు వెళ్లకుండాపోయిన పరిస్థితి ఏర్పడినది. రంగసముద్రం చెరువు కేవలం కంపచెట్లకు, చెరువు ఆక్రమణలకు తప్ప ఎలాంటి ఉపయోగం లేని పరిస్థితి కనుక వెంటనే ఇరిగేషన్ అధికారులు స్పందించి బెల్లగోడి కాలువను పూర్తిగా మల్లకత్తవనుండి రంగసముద్రం చెరువు వరకు పంట కాలువపూడిక ,ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించి కాలువ ఆక్రమణలను, అరికట్టి ప్రజలకు రైతులకు నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పోరుమామిళ్ల మండల సమితిగా తెలియజేస్తున్నాం లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేసి కంప చెట్లు, పూడిక తొలగించే వరకు రిలే దీక్షలు చేపడతామని సిపిఐ నాయకులు హెచ్చరించారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి

- మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర-సంబేపల్లె: వైసిపి అధికారం లేనప్పుడు పార్టీ బలోపేతానికి కార్యకర్తలు బలంగా కలసి పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మోటకట్ల, ప్రకాష్ నగర్ కాలనీ, దుద్యాల, రౌతుకుంట గ్రామాలలో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలకు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేయకుండా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టి వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా వ్యతిరేకతను రాష్ట్ర గవర్నర్ కు తెలియజేస్తామన్నారు. వైసిపి పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుండి బలోపేతం చేయడమే జగన్ మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తుఫాను బాధిత రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-బద్వేలు: తుఫాను కారణంగ నష్టపోయిన నియోజకవర్గరైతాంగాన్ని ఆదుకోవాలని వెంటనే ప్రభుత్వం నష్టనివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం బద్వేలు ఏరియా అధ్యక్షులు పొంగూరు నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నాడు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బద్వేలు గోపవరం మండలాల్లోనే వివిధ గ్రామాల్లోని నీట మునిగిన పంట పొలాలలో పర్యటించారు. ఈ సందర్భంగ రైతులను వారి కష్ట నష్టాల గురించి అడిగి తెలుసుకున్నారు అనంతరం వారు మాట్లాడుతూ మొంథ తుఫాను రైతాంగాన్ని అతలాకుతలం చేసిందని రైతులు పండించిన పంటలు నేలపాలు అయినాయని పంట వడ్డీలకు తీసుకొచ్చి పంటలుసాగు చేశారని ఇప్పటికే పెద్ద మొత్తంలో ఖర్చు చేశారని. మరో పది రోజుల్లో పంట చేతికి రాబోతుండగా తుఫాను కారణంగా నేటికీ దాదాపు 2,3, ఆడుగుల మేర నీళ్లలో పంట మునిగి ఉందని ఇటువంటి పరిస్థితుల్లో ఒక్క రూపాయి కూడా రైతులకు తిరిగి వచ్చే పరిస్థితి లేదని వారు ఆవేదన వెళ్లబుచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్థానిక రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండల పరిధిలోని రేకలకుంట పంచాయతీలో, ఎస్సీ గ్రామంలోనే నూతనంగా విద్యుత్ స్తంభాలు వైర్లను ఏర్పాట్లను మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు, మండలంలోని రేకలకుంట ఎస్సీ కాలనీలో నూతన విద్యుత్ స్తంభాలు, కేబుల్ వైర్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఎన్నో ఏళ్లుగా పాత స్తంభాలు, పాడైపోయిన తీగల కారణంగా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. ఈ సమస్యను తెదేపా మండల అధ్యక్షులు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, మండల మాజీ ఎంపీపీ మాలెపాటి సుబ్బారావు, స్థానిక యువ నాయకులు కానాల మల్లికార్జున రెడ్డి, గమనించి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సమస్యలపై తక్షణ స్పందన చూపిన ఎమ్మెల్యే ఆదేశాల మేరకు, విద్యుత్ శాఖ అధికారులు వేగంగా చర్యలు తీసుకొని కాలనీలో కొత్త స్తంభాలు, వైర్లు అమర్చారు. కార్యక్రమంలో తెదేపా కార్యకర్తలు నాగి పోగు,మధు, రాజరత్నం, దాసు, సభాపతి తదితరులు పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయున్ని విధుల నుండి తొలగించాలి

- సిపిఐ మండల కార్యదర్శి ప్రభాకర్

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండలంలోని యంపిపియస్ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న మైనర్ విద్యార్థినీల పట్ల కామంతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుని విధుల నుండి తొలగించాలనీ సిపిఐ మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం బ్రహ్మంగారిమఠంలోని సిపిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకి విద్యాబుద్ధులు నేర్పించాల్సినటువంటి ఉపాధ్యాయుడే అసభ్యకరంగా విద్యార్థులపై ప్రవర్తించడం సిగ్గుచేటని అదేవిధంగా రాధాకృష్ణ అనే ఉపాధ్యాయుడు మనవడు, మనమరాలు వయసులో ఉన్న ఐదవ తరగతి చదువుతున్న మైనర్ అమ్మాయిలపైన అసభ్యకరంగా ప్రవర్తించడం సమాజం తలదించుకునే విధంగా జరిగిన పరిణామమని, ఉపాధ్యాయునిపై గతంలో కూడా ఈ విధంగానే ప్రవర్తించడంపై విద్యార్థులు విద్యాశాఖ అధికారుల దృష్టికి కూడా తీసుకు వెళ్లడం జరిగింది. అయినా కూడా మార్పు లేదు. ఈరోజు ఈ మధ్యకాలంలోనే కూడా ఉపాధ్యాయుడు విద్యార్థినిలపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో విద్యార్థినీలు వారు ఉంటున్న వసతి గృహంలో ఉన్నటువంటి వార్డెన్ గారికి చెప్పడంతో విషయం వెలుగులోకి రావడం జరిగింది. ఈ ఉపాధ్యాయుని పై గతంలో ఇదే స్కూల్ లో ఆయా ను ఇదేరకంగా వేధింపులకు గురి చేశాడని ఆరోపణలున్నాయి. గతంలో సోమిరెడ్డిపల్లె స్కూల్ లో పనిచేసేటపుడు నాడు నేడు పనుల్లో కూడా నిధులు దుర్వినియోగం చేశాడని ఆరోపణలు ఉన్నాయి. ఈరోజు డిప్యూటీ డిఇఓ గారు జరిగిన ఘటనపై విచారణ చేయడం జరిగింది. ఈ ఘటన పైన జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకొని ఉపాధ్యాయుని విధుల నుంచి తొలగించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

న్యాయం లేని ఈ వ్యవస్థలో..

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండలంలోని నరసన్న పల్లె గ్రామానికి చెందిన సన్నబోయిన ధనలక్ష్మి వయస్సు 14 సంవత్సరాలు పుట్టుకతోనే రెండు కాళ్లు రెండు చేతులు ఏమాత్రం కూడా పని చేయనటువంటి పాప. ఇటువంటి వారిని ప్రభుత్వం నెలకు 15000 పింఛన్ ఇస్తూ ఆర్థికంగా కొంచెం వారికి చేదోడును ఇస్తూ ఉంటే కూటమి ప్రభుత్వంలో 100% దివ్యాంగులని సర్టిఫికెట్ వచ్చినప్పటికీ కేవలం 4000 పింఛన్ తోనే సరిపెట్టడం చాలా బాధాకరమైన విషయం. అసలైన లబ్ధిదారులకు అసలైన దివ్యాంగులకు ఇలాగేనా ఈ ప్రభుత్వం న్యాయం చేయవలసింది. ఈ కూటమి ప్రభుత్వంలో అన్ని బాగున్నా బోగస్ సర్టిఫికెట్లతో పింఛన్లు తెచ్చుకున్న వారి పని మూడు పూలు ఆరు కాయలుగా ఉన్న నిజమైన దివ్యాంగుల పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంది. ఇటువంటి వారిని గుర్తించి అధికారులు ప్రజా ప్రతినిధులు న్యాయం చేయడంలో పూర్తిస్థాయిలో విఫలమవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశీలన చేసి దివ్యాంగుల పాపకు న్యాయం చేయాలని. కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

పంటలు నష్టపోయిన రైతులకు పంటల బీమా చెల్లించాలి

పంటల పరిశీలనలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: గత వారం రోజులుగా మొంథా తుఫాను వల్ల కురుస్తున్న భారీ వర్షాలకు నేలకొరిగిన వరి పంటను గురువారం చాపాడు, ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరు, అయ్యవారిపల్లె, తిమ్మాయి పల్లె, రాజువారిపేట గ్రామాలలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంవి సుబ్బారెడ్డి, పి.భాస్కర్, పి.శ్రీరాములు, పల్లవోలు రమణ, పల్లవోలు మాజీ సర్పంచ్ గజ్జెల బాల చెంద్రాయుడు, మండల కార్యదర్శి రామాంజనేయులు, చిలుంగారి పుల్లయ్య, గోశెట్టి రామ్మూర్తి, కటారు గంగయ్య తదితరులు పర్యటించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ మొంథా తుఫాను ప్రభావంతో ఎడతెరిపిలేని వర్షాల వల్ల చేతికొచ్చిన పంటలు చేలోనే పడిపోయాయన్నారు. అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లాలో 13వేల ఎకరాలలో వ్యవసాయ పంటలైన వరి, మినుము, కంది, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, పెసర, నువ్వు, పదివేల ఎకరాల పైబడి ఉద్యాన పంటలైన ఉల్లి, మిరప, టమోటా లాంటి పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో రెవిన్యూ, వ్యవసాయ అధికారులు పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యం జరుగుతుందన్నారు. పైగా ప్రభుత్వం నుండే 30% పైబడి నష్టం జరిగి ఉంటే మాత్రమే వివరాలు నమోదు చేయాలన్న ఆదేశాలు సరి కావన్నారు. గత ప్రభుత్వం పంటలు బీమా ప్రీమియం మొత్తం చెల్లిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులే ప్రీమియం చెల్లించాలన్న ఆదేశాలు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంలో వైఫల్యం చెందారన్నారు. వరి సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, రైతు శ్రమ కలిపి ఎకరాకు 30నుండి 40 వేలు ఖర్చు అవుతుందని, పంట చేతికి వస్తే పెట్టుబడులు పోను ఎకరాకు 10వేలు మిగిలితే చాలని గంపెడంత ఆశతో ఎదురుచూస్తున్న రైతులకు మొంథ తుఫాను వచ్చి ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. కరువు, తుఫాను వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించే అంశంపై కాలం చెల్లిన మాన్యువల్ అమలు చేయడం దుర్మార్గమన్నారు. నేల పాలైన పంటను నూర్పిడి చేసుకునేందుకు వరి కోత మిషన్లను ఆశ్రయిస్తే గంటకు 4వేలు చొప్పున ఎకరాకు 12వేలు డిమాండ్ చేస్తున్నారని దీని ప్రకారం పంటను కోయాలంటే రైతు చేతి నుండి అదనంగా చెల్లించాల్సిన దుస్థితి నెలకొన్నదని అన్నారు. పాలక ప్రభుత్వాలు వరి కోత మిషన్లు హైర్ సెంటర్లలో అందుబాటులో ఉంచామని చెప్పినప్పటికీ ఆచరణలో ఎక్కడ అందుబాటులో లేవన్నారు. నిత్య విపత్తులతో తల్లడిల్లుతున్న రైతాంగాన్ని ఆదుకునేం దుకు వ్యవసాయ రుణాలపై మారటోరియం ప్రకటించి, కొత్త రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పద్మలతతో, స్థానిక వీఆర్వో మంజులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతులు నాయబ్ రసూల్, భాష, బాదుల్లా, చాన్ బి పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-కడప వైవీయూ: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యం లో గీతా జయంతిని పురస్కరించుకొని భగవద్గీత పై పలు పోటీలను కడప పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల శ్రీ కోదండ రామాలయం లో నిర్వహిస్తున్న సందర్భంగా సంబంధిత గోడపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయలసీమ క్లస్టర్ సూపరింటెండెంట్ ఢిల్లి రెడ్డి మాట్లాడుతూ హౌసింగ్ బోర్డు రామాలయంలో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు గల విద్యార్థినీ విద్యార్థులకు ఒక విభాగంగా శ్రీమద్ భగవద్గీత 14వ అధ్యాయం గుణత్రయ విభాగయోగం పై పోటీలు ఉంటాయి. 10వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు గల విద్యార్థిని విద్యార్థులకు శ్రీమద్ భగవద్గీత 16వ అధ్యాయం దైవాసుర సంపద్ విభాగయోగం పై పోటీలు ఉంటాయి. అలాగే 18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల వరకు ఉన్న వారికి నిత్యజీవితంలో భగవద్గీత భావ విశ్లేషణ అనే అంశం మీద పోటీలు ఉంటాయి. ప్రతి విభాగం నుండి కూడా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. వివరాలకు సంప్రదించవలసిన సెల్ నెంబర్... 9110779066. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఉమ్మడి కడప జిల్లా డా. గోపీబాబు, రామాలయం ధర్మకర్త డి.వెంకట రెడ్డి, హిందూ ధర్మప్రచార పరిషత్ సభ్యులు సి. సుబ్బారెడ్డి, డా. చింతకుంట శివారెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ దినోత్సవం ఉత్సవాలు

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండల కేంద్ర పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు, వ్యాసరచన వక్తృత్వ క్విజ్ పోటీలను నిర్వహించినట్లు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో భారత రాజ్యాంగ దినోత్సవ ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నవంబర్ 1 తేదీన మైదుకూరు నియోజకవర్గం స్థాయిలో పోటీలు జరుగుతాయని విద్యార్థులను ఎంపిక ఎంపిక చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దిరాజు పల్లె పాఠశాల ఉపాధ్యాయురాలు లక్ష్మి, ఎస్ అఖిల కేజీబీఆర్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆర్.నరసింహరెడ్డి, వేణు గోపాల్ వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చౌడయ్యా కుంట అలుగునీరు మళ్లింపు

విశాలాంధ్ర-రామాపురం: చౌడయ్య కుంట అలుగు నీరు రెడ్డి చెరువు (దర్గా చెరువు) కు మళ్లించినట్లు తాసిల్దార్ వెంకటేశులు తెలిపారు. మండలంలోని నీలకంఠరావుపేట పంచాయతీ పరిధిలోని చౌడయ్య కుంట. భద్రయ్య కుంట లు నిండి భద్రయ్య కుంటప్రమాదపు అంచులలో కట్ట పైనుండి నీరు ప్రవహించడంతో నీలకంఠరావుపేట టిడిపి నాయకులు ఆ గ్రామ ఉపసర్పంచ్ మహబూబ్ బాషా. పెంచల రెడ్డి.భాష వల్లి. యూనిట్ ఇంచార్జ్ మహబూబ్ బాషాలు. రాష్ట్ర రవాణా మరియు యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఆయన తహశీల్దార్ వెంకటేశులు. ఇరిగేషన్ ఏ ఈ మహబూబ్ బాషాలకు ఆదేశించడంతో వెంటనే అధికారులు స్పందించి గురువారం ఆ గ్రామ టిడిపి నాయకులు ఉపాధి కూలీలచే చౌడయ్య కుంట అలుగు నీళ్లు రెడ్డి చెరువుకు మళ్లించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నీలకంఠ రావు పేట గ్రామ ఉపసర్పంచ్ ఎస్.మహబూబ్ బాషా. టిడిపి నాయకులు పెంచల్ రెడ్డి. అబ్బ్ బిక్కమ్ సిద్ద. రియాజ్. హాలీ. ముజీహిద్. ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

చురుకుగా వర్షపు నీరు తరలింపు పనులు

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: వర్షాలు ఆగడంతో ఎర్రగుంట్ల పురపాలిక లోని పలు ప్రాంతాల్లో నిలిచి ఉన్న వర్షపు నీటిని మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా బయటికి తరలిస్తున్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకూడదన్న ఉద్దేశంతో కమిషనర్ శేషఫణి సిబ్బందిని రంగంలోకి దించారు. ప్రాధాన్యత క్రమంలో వీధులలోని వర్షపు నీటిని తొలుత ట్యాంకర్లకు నింపి బయటి ప్రాంతాల్లో వదులుతున్నారు. చురుకుగా కొనసాగుతున్న ఈ పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుండడం గమనార్హం.

రిమ్స్‌లో శానిటేషన్ కార్మికులు, సూపర్వైజర్లు ఆందోళన

విశాలాంధ్ర-కడప: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో నూతన శానిటేషన్ కాంట్రాక్టర్ పరిధిలో ఈనెల ఒకటో తారీకు నుంచి నియమించబడి పని చేస్తున్న కొందరు సూపర్వైజర్లు, కొందరు శానిటేషన్ మహిళా కార్మికులు గురువారం ఐ.పి విభాగంలో శానిటేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తమను నిబంధనల మేరకు డిగ్రీ ఉత్తీర్ణత పొందిన వారిని ఈనెల 1వ తేదీ నుంచి సూపర్వైజర్లుగా విధుల్లోకి తీసుకొని, ఉన్నపలంగా తమను తీసివేయడం ఎంతవరకు సమంజసం అని పదిమంది ఆందోళన చేపట్టారు. మరోవైపు మహిళ శానిటేషన్ కార్మికులు తమను వారం పది రోజుల నుంచి విధుల్లోకి తీసుకుని తర్వాత ఈరోజు నుంచి విధుల్లోకి రావద్దని చెప్పడం భావ్యం కాదన్నారు. సూపర్వైజర్లుగా పనిచేస్తున్న వారు తమను మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి సిఫారసులేఖలను తీసుకురమ్మని ఎండి చెప్పినట్లుగా ప్రస్తుతం రిమ్స్‌లో సంస్థ తరపున ప్రతినిధిగా వ్యవహరిస్తున్న సురేష్ చెబుతున్నారని, తమను నెలరోజుల పాటు ఉద్యోగం చేయించుకుని తర్వాత వద్దనడం ఎంతవరకు భావ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ఎట్టి పరిస్థితుల్లోనూ విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రవేటీకరణను ఆపాలి

విశాలాంధ్ర-కడప: పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్షిప్ పేరుతో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని, పిపిపి విధానంతో బడుగు, బలహీన, వర్గాల పేద వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయొద్దని ఎన్డీఏ కూటమి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, గురువారం కడప నగరంలోని కలెక్టరేట్ కార్యాలయంలో డిఆర్ఓ విశ్వేశ్వరనాయుడుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిఆర్ఎస్ వైయఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ఎన్డీఏ ప్రభుత్వం పిపిపి పేరుతో ప్రైవేటీకరణ చేసి బడుగు, బలహీన పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు వైద్య విద్య దూరం చేస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎన్డీఏ రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి జీవో నెంబర్ 590 ను రద్దు చేసి, ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచనను ఉపసంహరించుకొని మెడికల్ కళాశాలల నిర్మాణాలను పూర్తి చేసి, కొనసాగించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని యెడల ఆందోళనలను తీవ్రస్థాయిలోకి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ వైయఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు, జిల్లా నాయకులు ప్రియాన్స్ పాల్గొన్నారు.

లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-లింగాల: లింగాల గ్రామానికి చెందిన అలవలపాటి మాధవీలత 16వ వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు సామాజిక సేవా కార్యక్రమంగా అన్నదానాన్ని నిర్వహించారు. లింగాల మండలం, ఇప్పట్ల సమీపంలోని లీలావతి వృద్ధాశ్రమంలో ఈ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాధవీలత తండ్రి అలవలపాటి పాపిరెడ్డి, తల్లి అనంతమ్మ, కుమార్తెలు సుష్మా రెడ్డి, హారిక రెడ్డి పాల్గొని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. మాధవీలత స్మారకార్థంగా ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు.

వ్యవసాయ వాణిజ్య పంటలకు తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలి

జాతీయ విపత్తుగా ప్రకటించాలి-రాచమల్లు ప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మొంథా తుఫాన్ తో దెబ్బతిన్న వ్యవసాయ వాణిజ్య పంటలకు తక్షణమే నష్ట పరిహారం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచమల్లు మాట్లాడుతూ తుఫాన్ కారణంగా జిల్లాలో వరి, మొక్కజొన్న, శనగ, మినుము, మిరప, పత్తి, పూలు ఇతర వాణిజ్య పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని అన్నారు. కేవలం ప్రచార ఆర్భాట కోసం పర్యటనలు, ఏరియల్ సర్వే తప్ప రైతులను ఆదుకోవాలన్న ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదన్నారు. వైసీపీ అధికారంలో ఉండగా రైతులకు ఉచిత పంట బీమాతో పాటు సకాలంలో విత్తనాలు అందించిన ఘనత వైసిపిదే అన్నారు. అలాగే ఆర్బీకే సెంటర్లు ఏర్పాటు చేసి, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం జరిగిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం కేవలం ప్రచార ఆర్భాటం తప్ప మరొకటి కాదన్నారు. రైతు వ్యతిరేక ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు. మొంథా తుఫాను జాతీయ విపత్తుగా ప్రకటించడమే కాకుండా రైతుల పెట్టుబడిని త్వరగా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, పిట్ట భద్రమ్మ, జయమ్మ, రాగుల శాంతి, కళావతమ్మ, వెలవలి శేఖర్ రెడ్డి, కోటూరు వెంకటేష్, రాజుపాలెం మండల కన్వీనర్ బాణా కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ చైర్మన్

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: నియోజకవర్గం ఓబులవారి పల్లి మండలంలోని బొమ్మవరం కమ్మపల్లి పరిధిలోని శివాలయం వద్ద గురువారం ఉదయం జరిగిన వివాహ వేడుకలలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగరాజు రవికుమార్ రాజు పాల్గొని చిట్వేల్ మండలంలోని సిపిఎం రాచపల్లి అరుంధతివాడ కు చెందిన నూతన వధూవరులు పోలి శివకేశవ, శ్రావణిలపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నూతన వధూవరులు జీవిత కాలం సంతోషంగా పండంటి కాపురాన్ని కొనసాగించాలని హృదయ పూర్వకంగా ఆశీర్వదించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగ అవకాశాలు

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: ప్రస్తుత పరిస్థితులలో యువతకు సాంకేతిక పరిజ్ఞానంతోనే అధిక శాతం ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని స్థానిక జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ-2 రామాంజనేయరెడ్డి స్పష్టం చేశారు. ఈ పాఠశాలకు చెందిన 9, 10 తరగతుల విద్యార్థులు వృత్తివిద్యలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థుల నైపుణ్యాల పెంపుకు వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టడం జరిగిందని, విద్యార్థులకు ప్రయోగాత్మకంగా పరికరాలను ఉపయోగించి వివరించడం, సమకాలిన అంశాల్లోనూ వారిని తీర్చిదిద్దడం వృత్తి విద్య యొక్క ప్రత్యేకత అని రామాంజనేయరెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్ఎం భాస్కర్ రెడ్డి, వృత్తి విద్యా ఉపాధ్యాయులు చంద్రబాబు రెడ్డి, ఒకేషనల్ ఉపాధ్యాయులు జనార్ధన్, తేజస్ దీప్, యోహాను తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అదృశ్యం

విశాలాంధ్ర-గాలివీడు: మండలంలోని అరవీడు గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు అదృశ్యమవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఎస్సై రామకృష్ణ కథనం మేరకు జుబేదా (15), జాస్మిన్ (13) అనే ఇద్దరు బాలికలు గాండ్లపల్లి హైస్కూల్లో ఎనిమిదవ తరగతి చదువుతున్నారు. ఈనెల 29వ తేదీ బుధవారం ఉదయం స్కూలుకెళ్తామని ఇంటి నుండి బయలుదేరిన వీరు ఆ తర్వాత ఇంటికి తిరిగి రాలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో గాలివీడు పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైమ్ నం.130/2025గా గర్ల్ మిస్సింగ్ కేసుగా దర్యాప్తు కొనసాగుతోంది. ఈ బాలికలు ఎక్కడైనా కనిపించినట్లయితే వెంటనే గాలివీడు ఎస్ఐ 9121100556 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఉరుసు కార్యక్రమానికి ఆహ్వానం

విశాలాంధ్ర-రాజంపేట: టంగుటూరులో జరిగే ఉర్సు కార్యక్రమానికి జనసేన పార్టీ అన్నమయ్య జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు యల్లటూరు శ్రీనివాసరాజును ముస్లిం పెద్దలు ఆహ్వానించారు. గురువారం ఉమ్మడి కడప జిల్లా, రాజంపేట నియోజకవర్గం, రాజంపేట పట్టణం, జనసేన పార్టీ కార్యాలయం (యల్లటూరు భవన్)లోనందలూరు మండలం టంగుటూరు రోడ్ లో ఉన్న దర్గా నందు ఈనెల 30, 31 తేదీలలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఉరుసు కార్యక్రమానికి జనసేన నేత యల్లటూరు శ్రీనివాస రాజుని కార్యనిర్వాహకులు ఆహ్వాన పత్రికను ఇచ్చి కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎం.డి యూసఫ్, మున్నాభాయ్, ఇంతియాజ్, నజీర్, ఫయాజ్, దాదా కలందర్, వెంకటంపల్లి చాంద్ బాషా, మహబూబ్ బాషా, జనసేన నాయకులు మస్తాన్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

విశాలాంధ్ర-సింహాద్రిపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో సెంట్రల్ కిచెన్ షెడ్ నిర్మాణా పనులున్నా త్వరగా పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ అన్నారు నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. విద్యార్థులతో ఆయన మాట్లాడారు కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఖాదర్ బాషా, శారద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

విశాలాంధ్ర-వాల్మీకిపురం: పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా త్వరలోనే తాగునీటి సమస్య శాశ్వతంగా తీరి పోనుందని, ఈ తాగునీటి పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2760 కోట్లు నిధులు మంజూరు చేసిందని ఎంపీడీవో మనోహర్ రాజు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశాన్ని ఉద్దేశించి ఎంపీడీవో మాట్లాడుతూ గండికోట నుంచి ప్రత్యేక ఫెడ్లైన్ల ద్వారా పీలేరు నియోజకవర్గంలోని ప్రతి పల్లెకు త్వరలోనే తాగునీరు అందనుందని, దీంతో తాగునీటి సమస్య పూర్తిగా తీరిపోనుందన్నారు. అంతకు మునుపు మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అరుణమ్మ, వైస్ ఎంపీపీలు గైర్వాజర్ కావడంతో మండలంలోని నగిరి మడుగు ఎంపీటీసీ రెడ్డెప్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వలిగట్ల వెంకట్రమణ మాట్లాడుతూ మొన్న జరిగిన డీఎస్సీలో కొత్త ఉపాధ్యాయులు వచ్చారని, గ్రామాల్లో కొరత ఉన్న చోట్ల గుర్తించి ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. తీవ్రవర్షాల దృష్టా గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలు అందించాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో చింతపర్తి పీహెచ్సీ సిబ్బందిని ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అభివృద్ధిపనులు, అధికారుల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం అధికారులతో చర్చించారు. జడ్పీటీసీ సభ్యురాలు నిర్మల, ఎంపీటీసీ రెడ్డెప్ప మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

టీటీడీ ఈవోని కలిసిన శ్రీశైలం చైర్మన్ పోతు గుంట

విశాలాంధ్ర-రాజంపేట: తిరుమలలో తిరుమల తిరుపతి ఎగ్జిక్యూటివ్ అధికారి అనిల్ సింఘాల్ ని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి స్వామివారి వస్త్రము ప్రసాదము అందజేయడం జరిగిందని శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం దోర్నాల వద్ద భక్తులకు యాత్రికుల కోసం తిరుమల తిరుపతి ద్వారా ఒక వసతి సముదాయము డార్మెటరీ నిర్మించాలని, అలాగే శ్రీశైలంలో కూడా టీటీడీ వసతి సముదాయాన్ని నిర్మించాలని వారికి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని చైర్మన్ పోతు గుంట తెలిపారు. టీటీడీ ఈవో వెంటనే సానుకూలంగా స్పందించి చేస్తామని చెప్పడం జరిగిందని, టిటిడి తరపున టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి ని వెళ్లి పరిశీలించి ఎన్ని గదులు అవసరము చెప్పమని వారికి చెప్పడం జరిగిందని తెలిపారు. టిటిడి పాలకమండలి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి పది రోజుల్లో శ్రీశైలం దర్శనానికి వచ్చి ఈ వసతి సముదాయాల గురించి పరిశీలించి ఈవో కి పూర్తిస్థాయిలో నివేదిక అందజేస్తానని వారు చెప్పడం జరిగిందన్నారు. అడిగిన వెంటనే ఈవో సానుకూలంగా స్పందించి ఖచ్చితంగా వసతి గదుల సముదాయం నిర్మిస్తామని చెప్పినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

పరిపాలన దక్షుడు చంద్రబాబు

టిడిపి రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: రాష్ట్రంలో విపత్తు వచ్చినా, ముందస్తుగా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, ప్రజలకు నేనున్నానని ధైర్యం చెప్పే పరిపాలన దక్షుడు చంద్రబాబు అని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ద్వారకా నగర్ లో ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి తుఫాన్ బాధితులను పరామర్శించడానికి తనకు విమానం లేదని, ముఖం చాటేశారని ఆయన విమర్శించారు. తుఫాన్ పై వైసీపీ నాయకులు ఫేక్ ప్రచారాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తూ, ప్రభుత్వంపై బురద జల్లుడు పనిగా పెట్టుకున్నారని ఆయన మండిపడ్డారు. ఐదేళ్లు అధికారంలో ఉండి ఒక్క పని చేయలేదని, పెండింగ్ ప్రాజెక్టులను పట్టించుకున్న పాపాన పోలేదని, చేసిన అప్పులు చెల్లించే అందుకు ఈ ప్రభుత్వం ఇబ్బందులు పడుతుందన్నారు. అన్ని రిజర్వాయర్లలో నీటిని నిలుపగలిగామని చెప్పారు. ఏపీలో గూగుల్ ఏర్పాటుకు జగన్ 2019 లో సంతకాలు చేశానని చెప్పడం హాస్యాస్పందంగా ఉందన్నారు. జగన్ ఆహ్వానిస్తే మరి గూగుల్ డేటా పెట్టేందుకు ఎందుకు వెనకడుగు వేసిందని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేష్ చొరవతో సాధ్యపడిందని చెప్పారు. ప్రాజెక్టులపై అవగాహన రాహిత్యంతో జగన్ సొంత నియోజకవర్గంలోని రిజర్వాయర్లకు కాలువలు పూర్తి చేయలేదన్నారు. రామకృష్ణ మఠం వద్ద 10 ఎకరాల్లో ఐటీ పార్క్ నిర్మాణానికి ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చాయని, ఉక్కాయ పల్లి వద్ద కొత్త సబ్ స్టేషన్ ఏర్పాటు కానుందని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని చెప్పారు.

బెల్ట్ షాపులను తొలగించాలి

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: రాయచోటి పట్టణంలోని జననివాసాల మధ్య మద్యం దుకాణాలను విచ్చలవిడిగా ఏర్పాటు చేశారని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మరి సుమిత్ర అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక మహిళలతో మాట్లాడుతూ మద్యం దుకాణదారులు ప్రభుత్వము నుండి ఎటువంటి అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ జన నివాసాల మధ్యనే మద్యం దుకాణాలు ఏర్పాటు మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కొంతమంది తాగి రాత్రి సమయాలలో బైకుల శబ్దాలు చేస్తూ నీచ పదజాలంతో దూషించుకుంటూ అటు ఇటు వెళ్లే ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం బెల్ట్ షాపులను రద్దుచేసి వాటి నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీదేవి, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

విశాలాంధ్ర-రాజంపేట: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని అన్నమయ్య జిల్లా జనసేన పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు యల్లటూరు శ్రీనివాసరాజు అన్నారు. గురువారం ఉమ్మడి కడప జిల్లా, రాజంపేట నియోజకవర్గం, రాజంపేట పట్టణం, జనసేన పార్టీ కార్యాలయం (యల్లటూరు భవన్)లో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధితులకు పంపిణీ చేసిన యల్లటూరు శ్రీనివాస రాజు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను తీసుకున్న వారిలో రాజంపేట మండలం తాళ్లపాక గ్రామానికి చెందిన బాలరాజు మురళీ మోహన్ రాజు కు రూ. 42,833/- వేలు, ఊటుకూరు గ్రామానికి చెందిన సంబారు శరత్ కుమార్‌కు రూ. 53,084 వేలు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు వైద్య ఖర్చుల నిమిత్తం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన శ్రేణులు, కూటమి శ్రేణులు, పట్టణ నాయకులు, జన సైనికులు,వీర మహిళలు పాల్గొన్నారు.

బ్రౌన్ జయంతి నిర్వహణ హర్షనీయం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: తెలుగు భాషా సాహిత్యాలు ఈరోజు ఇంత దేదీప్యమానంగా వెలుగుతున్నాయంటే దానికి మూలం సిపి బ్రౌన్ అని, అలాంటి తెలుగు భాషా సముద్ధారకుని జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని బుధవారం ఉత్తర్వులు జారీ చేయడం శుభ పరిణామమని వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉదయం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్బులో కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సిపి బ్రౌన్ దొరగారు ఆంధ్ర భాషా సేవకే జన్మించాడనిపిస్తుందని, శిథిలమైపోతున్న తాళపత్ర గ్రంథాలను సేకరించి, సంస్కరింపజేసి, కాగితాలపై ఎత్తి రాయించి, పాఠక భేదాలను పరిశీలించి ముద్రించిన తెలుగు వెలుగని అన్నారు. బ్రౌన్ సేకరించిన గ్రంథాల నుండే కందుకూరి వీరేశలింగం పంతుల 'ఆంధ్ర కవుల చరిత్ర', చిలుకూరి వీరభద్ర రావు 'ఆంధ్రుల చరిత్ర', ఉద్భవించాయంటే మనకు ఆశ్చర్యం కలుగుతుందన్నారు. కాలం లో కలిసిపోయిన వేమన కీర్తిని నిలబెట్టిన ఘనత మొదట బ్రౌన్ కే దక్కుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న ఉదాత్తమైన ఈ నిర్ణయం సముచితమని, సమంజసమని, భాషా ప్రేమికులందరికీ హర్షనీయమన్నారు. 'మధురకవి' డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి ప్రసంగిస్తూ బ్రౌన్ మహాశయుడు తెలుగు భాష పై పట్టు సాధించడానికి ఆంధ్ర గీర్వాణ చందస్సు నేర్చుకున్నాడని, చివరకు దానిపై ఒక పుస్తకమే రాశాడని, తరువాత తెలుగు వ్యాకరణాన్ని నేర్చుకుని ఆంగ్లంలో తెలుగు వ్యాకరణాన్ని రాశారని, వేమన పద్యాలు సులభంగా అర్థం కావాలంటే ఒక నిఘంటువు కావాలని గుర్తించి,కేవలం వేమన పద్యాల కోసమే నిఘంటువును రూపకల్పన చేసిన దీక్షా దక్షుడని అన్నారు. కార్యక్రమంలో రాజీవ్ కల్చరల్ క్లబ్ అధ్యక్షుడు మురళి, సాహితీ మిత్రులు దేవరశెట్టి గంగయ్య, యడవల్లి రామలింగయ్య, సత్యనారాయణ, ప్రకాశం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

విశాలాంధ్ర-పీలేరు: నడిమి కండ్రిగ సుధాకర్ బాబు అధ్యక్షతన పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూకూటమి ప్రభుత్వం పీలేరు చుట్టుపక్కల ప్రజల మనోభావాలు గౌరవించి పీలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి మల్లెల జాకీర్, ముల్లంగి చంద్రయ్య,భారతీయ అంబేద్కర్ సేన, పూలకుంట శ్రీనివాసులు, మాల మహానాడు, ధరణి కుమార్, జెట్టే మల్లికార్జున ఐక్యవేదిక, గుర్రం నారాయణ, రామాంజులు రామాంజులు,బద్దే భానుప్రకాష్,కాంగ్రెస్ దబ్బా శ్రీకాంత్,వైఎస్ఆర్ మాలతోటి నరేష్, దళిత నాయకులు ఈ పూరి ఆంజనేయులు, కొండయ్య, తిమ్మయ్య, ప్రసాద్ , వేకటేష్,అంజి వగల్ల, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వరదను కలిసిన నూతన జేడీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: కడప జిల్లా పశు సంవర్ధక శాఖ నూతన జేడీగా బదిలీపై వచ్చిన డాక్టర్ ఎన్.ఏ శ్రీనివాసులు గురువారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డిని కామానూరులోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బొకే అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఏడి డాక్టర్ఆ ర్.ధనుంజయ రెడ్డి, కామనూరుటి.మాధవ ఓబుల్ రెడ్డి,లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఖాదర్ బాబు, డేటా ఎంట్రీ ఆపరేటర్ రంగనాథ్ పాల్గొన్నారు.

73 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 17వ విడత క్రింద ముఖ్య మంత్రి సహాయనిధి నుండి 73 మందికి 48లక్షల 22వేల 228 రూపాయల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని, వైద్య చికిత్సల నిమిత్తం ప్రైవేట్ హాస్పిటల్ వైద్యం చేయించు కున్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా అందజేయడం జరుగుతుందని అన్నారు. ఇవి ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. గత ప్రభుత్వంలో కంటే అనారోగ్య బారిన పడిన వారికి 10 ఇంతలుగా సహాయాన్ని సీఎం ద్వారా వస్తున్నదని అన్నారు.

భారతీయ ప్రజాసేవ పార్టీ జిల్లా అధ్యక్షునిగా రాయపాటి మాబు



విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: భారతీయ ప్రజాసేవ పార్టీ జిల్లా అధ్యక్షునిగా రాయపాటి మాబును నియమించారు. తనను నియమించిన భారతీయ ప్రజాసేవ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్. వి రమణా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో నెలకొన్న సమస్యల పట్ల ప్రజల సౌకర్యార్థం ఎప్పటికప్పుడు పరిష్కారం కొరకు కృషి చేస్తానని రాయపాటి మాబు తెలిపారు. అధికారులకు ప్రజలకు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని, పార్టీ అభివృద్ధికి నాయకుల సూచనలు, సలహాలు పాటిస్తూ ప్రజల సమస్యల పట్ల స్పందిస్తూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

పూల నజీర్ మాతృమూర్తికి శ్రద్ధాంజలి ఘటించిన ఎన్.తులసిరెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రొద్దుటూరు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎస్ఎండి పూల నజీర్ మాతృమూర్తి పూల అబిదాబి అనారోగ్యంతో బుధవారం స్వర్గస్తులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు తదితరులు గురువారం అబిదాబికి శ్రద్ధాంజలి ఘటించారు.

కోటి సంతకాల సేకరణలో విద్యార్థిని, విద్యార్థులను ఏకం చేస్తూ..

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణం చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, మాజీ సీఎం వై.యస్ జగన్ తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మరింత బలం చేకూర్చేందుకు గురువారం ప్రొద్దుటూరు నియోజవర్గంలోని గౌతమి ఇంజనీరింగ్ కళాశాలలోనీ విద్యార్థినీలకు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు పూల శ్రీని వాసులు రెడ్డిలు అవగాహన కల్పించారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి మరియు నియోజకవర్గ మహిళా, విద్యార్థి విభాగం , నాయకురాలు, క్రియాశీలక కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాతాదారుల శ్రేయస్సే పీలేరు సహకార కేంద్ర బ్యాంక్ లక్ష్యం

విశాలాంధ్ర-పీలేరు: చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పీలేరు శాఖ ఆధ్వర్యంలో ఖాతాదారుల సమావేశం విజయవంతంగా జరిగింది. శాఖ మేనేజర్ విజయ్ కుమారి అధ్యక్షత వహించగా, బ్యాంకు సీఈఓ వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శంకరయ్య, ఖాతాదారులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.సీఈఓ వెంకటేష్ మాట్లాడుతూ బ్యాంక్ సేవలను మరింత పారదర్శకంగా, సులభంగా అందించేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని తెలిపారు.మేనేజర్ విజయ్ కుమారి మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్థిర డిపాజిట్ పథకాలు, గోల్డ్ లోన్లు, హౌస్ మోర్టేజ్, వ్యవసాయ రుణాలు, షీ రుణాలు వంటి పథకాల వివరాలు తెలియజేశారు. సూపర్వైజర్ శంకరయ్య మాట్లాడుతూ సహకార బ్యాంకులు గ్రామీణ ప్రజల ఆర్థికాభివృద్ధికి మూలస్తంభాలుగా ఉన్నాయని, డిజిటల్ బ్యాంకింగ్ సేవలను అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమం ముగింపులో ఖాతాదారుల ప్రశ్నలకు మేనేజర్ సమాధానాలు ఇచ్చి, అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

చలో హైదరాబాద్ తరలిరండి

దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-పీలేరు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయి పై జరిగిన దాడికి నిరసనగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకునవంబర్ -1న హైదరాబాదులో నిర్వహించే దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఆర్పిఎస్, ఎంఎస్పి పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ ఎం ఎస్ పి పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్, పీలేరు నియోజకవర్గం కో ఇన్చార్జి అమరాల వెంకట రమణ, వాల్మీకిపురం మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు గంత బాల కృష్ణ, ఎంఎస్పి సీనియర్ నాయకులు సంగీతం రవి రవీశ్వరయ్య, కలకడ మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు వంగిమల్ల హరినాధ, కేవీ పల్లి మండలం ఎంఆర్పిఎస్ అధ్యక్షులు సందిపోగల రాము, ఎంఎస్పి సీనియర్ నాయకులు బేతపూరి వెంకటరమణ, రాచపల్లి వెంకట రమణ, పీలేరు మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు గండికోట రెడ్డి కుమార్, ఎంఎస్పి పీలేరు మండల అధ్యక్షులు ఇంగ్లే బాలసుబ్రమణ్యం, మండల కమిటీ, యువ నాయకులు రవీంద్ర, రాజా, రాము, పవన్, నరేష్, మత్తయి, నరసింహ, చరణ్, కృష్ణయ్య,గుర్రం కొండ మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు రెడ్డి ఆంజనేయులు, ఎం ఎస్ పి సీనియర్ నాయకులు ప్రసాద్, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

తూనికలు కొలతలు నిక్కచ్చిగా ఉండాలి

విశాలాంధ్ర-సంబేపల్లె: నిత్యవసర సరుకుల పంపిణీలో తూనికలు కొలతలు నిక్కచ్చిగా ఉండాలని తహసిల్దార్ సుబ్రహ్మణ్యం రెడ్డి తెలియజేశారు. గురువారం తాసిల్దార్ కార్యాలయంలో తూనికలు కొలతల విభాగానికి చెందిన సిబ్బందితో కలిసి డీలర్ల వద్ద తెచ్చిన వేయింగ్ మిషన్ రాళ్లు పరిశీలించారు. కొలతలలోవ్యత్యాసాలను గమనించారు. వ్యత్యాసాలు ఉంటే సవరించి తూనికల కొలతల విభాగం నుండి ఒక సర్టిఫికెట్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. డీలర్లు ఈ సర్టిఫికెట్లను చౌక దుకాణంలో భద్రపరుచుకోవాలని తెలియజేశారు. ప్రామాణికంగా తూనికలు కొలతలు కచ్చితంగా ఉండేలా చూడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తూనికల కొలతల విభాగం కోఆర్డినేటర్ రామయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన పిల్లలకు అభినందనలు

విశాలాంధ్ర-కొండాపురం: కొండాపురంలోని శివసాయి ద గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు ఈ నెల 27వ తేదీన బెంగళూరులో జరిగిన 3వ జాతీయ స్థాయి అబాకస్, మెంటల్ అర్థ మెటిక్ కాంపిటీషన్‌లో పాఠశాల లోని 1 నుండి 5వ తరగతిలోపు 18 మంది పిల్లలు పోటీల్లో పాల్గొన్నారు. మొత్తం ఈ పోటీల్లో 11 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో వెంకట సహస్ర, మన్విత, మిథున, పీయుష్ లు జాతీయ స్థాయిలో రెండవ స్థానంలో నిలిచారు. హరిణి, ప్రజ్ఞశ్రీ, అవికలు మూడవ స్థానం, ఐరా ఆనం, శశాంక్, లౌహిత్య, గంగామయుక, సత్య పళని, గురు ప్రజ్ఞ శ్రీ, శ్రీయాన్, శశాంక్, రంజిత్ కుమార్, ఆయాన్, జస్మిత లు మెరిట్ స్థానంలో బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా గురువారం వారందరినీ పాఠశాల కరస్పాండెంట్ సాంబ శివయ్య యాదవ్, హెడ్మాస్టర్ కిషోర్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, పలువురు ప్రజలు అభినందనలు తెలియచేసారు.

వైసీపి ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీగా రమేష్ నియామకం

విశాలాంధ్ర-పీలేరు: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీగా బడుగు రమేష్ నియమించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఈ పదవి తనకు రావడానికి మాజీమంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్ఆర్సిపి పెట్టిన జీవోలు అన్నీ తొలగించాలి

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు డిమాండ్

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో చైర్మన్ పురం రామ్మూర్తి ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లాలోని మార్కెట్ కమిటీ చైర్మన్‌లతో గురువారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తమ సమస్యలైన పదవీకాల సవరణ, గౌరవేతనం, మార్కెట్ కమిటీలకు స్వయం ప్రతిపత్తి, మార్కెట్ కమిటీల వర్గీకరణ, అధ్యక్షులకు వాహన సదుపాయం, సీఎం ఎఫ్ నిధుల వినియోగం, స్థానిక మార్కెట్ అభివృద్ధి నిధులు, మార్క్ ఫీడ్ మినహాయింపు ఉపసంహరణ, డి నోటిఫై చేసిన పంటలు తిరిగి నోటిఫై చేయుట, మార్కెట్ కమిటీల పనితీరు, అభివృద్ధి, సిబ్బంది లోటు ప్రొక్యూర్మెంట్లో మార్కెట్ కమిటీల ప్రాధాన్యం తదితర అంశాలపై చర్చించారు. పీలేరు కలికిరి, వాయల్పాడు, మదనపల్లి రాయచోటి లక్కిరెడ్డి పల్లి మార్కెట్ యార్డుల కమిటీ చైర్మన్ లు పురం రామ్మూర్తి, మాలతి, చంద్రమౌళి,జంగల శివరాం రాయల్, అన్నం పల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎస్.యం.డి షఫీ నాయక్ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గోళ్ళ కిషోర్ నాయుడు, లక్ష్మీ పతి, బాబు పాల్గొన్నారు.

పీలేరు నుండి తిరుపతికి రెండు అదనపు ప్రత్యేక బస్సులు

బస్‌స్టేషన్ మేనేజర్ బాబు నాయక్‌తో డిపో మేనేజర్ ఎస్.ఎం.డి.రోషన్

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించాలని డిపో మేనేజర్ రోషన్ బస్ స్టేషన్ మేనేజర్ బాబు నాయక్ సూచించారు. పీలేరు ఆర్టీసీ బస్టాండ్ విచారణ కేంద్రం వద్ద డిపో మేనేజర్ రోషన్ కొంత సమయం ఉండి బస్టాండు ఆవరణాన్ని పరిశీలించారు. బస్సుల రాకపోకలను ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రోషన్ మాట్లాడుతూ పీలేరు నుండి తిరుపతి కి ప్రయాణికుల రాకపోకలు పెరిగాయని అన్నారు. బైపాస్ రోడ్డు ఏర్పాటు కాక మునుపు రాయచోటి, మదనపల్లి వెళ్లే ఎక్స్ప్రెస్ బస్సులు పీలేరు బస్టాండుకు వచ్చి వెళ్లేవని అన్నారు.

సందర్శన

విశాలాంధ్ర-పెద్ద తిప్పసముద్రం: స్థానిక బి.కొత్తకోట రోడ్డులోని పట్టు పరిశ్రమల సిల్క్ ఇండస్ట్రీని గురువారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ప్రిన్సిపాల్ శివకుమారి ఆధ్వర్యంలో ఒకేషనల్ ఉపాధ్యాయుడు చంద్రహాస్, ఎలక్ట్రానిక్స్ పూర్ణచంద్ర (ఐటి) తరగతి నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులు పరిశ్రమల సందర్శనకు వెళ్లారు. సిల్క్‌ఫ్యాక్టరీలో పట్టు పురుగుల జీవిత చక్రం వాటి వివిధ దశలు పట్టుగూళ్ల నుండి పట్టును సేకరించే విధానాన్ని పరిశీలించారు. పట్టు పరిశ్రమ యంత్రాల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఉల్లి.. తల్లడిల్లి

భారీగా పంట నష్టం



విశాలాంధ్ర-మైలవరం: ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చిన్నవేణుతుర్ల, వద్దిరాల, బెస్తవేముల, తలమంచిపట్నం, దోడియం, ఎమ్. కంబాల దీన్నే, తొర్రివేముల మొదలగు గ్రామాలలో ఉల్లి పంట దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లి పంట దిగుబడి బాగా రావడంతో ఆదాయం వస్తుందన్న రైతు ఆశకు వరుడు నిరాశ కలిగించాడు. దీంతో ఉల్లి పంట ఎకరాకు దాదాపుగా లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టినట్లు చిన్నవేణుతుర్ల రైతు శివరామిరెడ్డి తెలిపారు. నాలుగు ఎకరాలు ఉల్లి పంట సాగు చేస్తే తుఫాను దెబ్బతో మొత్తం నాలుగు ఎకరాల్లోని పంట పూర్తిగా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో మొత్తం దాదాపుగా 20 ఎకరాలలో ఉల్లి పంట దెబ్బతిన్నట్లు రైతులు పేర్కొన్నారు.ఈ విషయమై మండల హార్టికల్చర్ అధికారి భరత్ రెడ్డిని విశాలాంధ్ర మైలవరం ప్రతినిధి వివరణ కోరగా కోత అనంతరం దెబ్బతిన్న ఉల్లి పంటకు నష్టపరిహారం వచ్చే అవకాశం లేదని కానీ పంటను ఆన్లైన్లో నమోదు చేసుకున్న వారికి హెక్టర్‌కు కర్నూల్‌లో ప్రతిపాదించిన రేటు ప్రకారం రైతులను ఆదుకునేందుకు జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

వీడ్కోలు

- అధికారిక లాంఛనాలతో హెచ్‌డ్ కానిస్టేబుల్‌కు అంత్యక్రియలు

విశాలాంధ్ర-రాయచోటి: జిల్లాలోని రామసముద్రం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ బత్తల లక్ష్మీనారాయణ బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. రాయచోటిలోని తన నివాసంలో నిద్రలోనే తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. లక్ష్మీనారాయణ మృతి పట్ల ఎస్పీ ధీరజ్ సంతాపాన్ని తెలియజేశారు. తక్షణ సహాయంగా రూ.లక్ష నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. రామసముద్రం ఎస్ఐ రమేష్‌బాబు, గాలివీడు ఎస్ఐ రామకృష్ణ, ఆర్ఎస్ఐ మురుగన్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది లక్ష్మీనారాయణ స్వగ్రామం గాలివీడు మండలం కరిమిరెడ్డిగారిపల్లెలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. ఏఆర్ పోలీసులు అధికారిక లాంఛనాలతో అంజలి ఘటించారు.



యోగ, ధ్యానంతో.. ఒత్తిడిని జయించవచ్చు

విశాలాంధ్ర-కడప వైవీయూ: యోగ, ధ్యానంతో ఒత్తిడిని జయించవచ్చునని యోగి వేమన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-9 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ డా.వెంకటరామి రెడ్డి సమ్యుక్త ఆధ్వర్యంలో యోగ, ధ్యానం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ కార్పొరేట్ ట్రైనర్ మోహన్ కుమార్ సి.వి. ప్రత్యేక అతిథిగా హాజరై, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు మానసిక శాంతి, ఆత్మనిగ్రహం, సానుకూల ఆలోచనల ప్రాముఖ్యతపై మార్గదర్శనం చేశారు. ఆయన 'నెగటివ్ థాట్స్‌ను ఎలా తొలగించుకోవాలి', 'నర్వస్ సిస్టమ్‌ను ఎలా సంతులనం చేయాలి' వంటి అంశాలపై ప్రాక్టికల్‌గా సూచనలు అందించారు. అలాగే బాడ్ అండ్ గుడ్ రియాక్షన్స్ ఎలా ఏర్పడతాయో, బుద్ధి, జ్ఞానం మధ్య సంబంధం ఏంటో వివరించారు. 'ఎక్స్పెక్టేషన్ - రియాలిటీ - ఫ్రస్ట్రేషన్' అనే సూత్రం ద్వారా, మన ఆశలు వాస్తవాల మధ్య సమతుల్యత సాధించడం వల్ల జీవితంలో నిరాశలు తగ్గి, మానసిక ప్రశాంతత పెరుగుతుందని ఆయన స్పష్టంచేశారు. చివరగా డాక్టర్ శ్రీనివాసరావు, నారాయణ రెడ్డి పాల్గొన్న వారందరికీ ధన్యవాదాలు తెలుపుతూ, విద్యార్థులు యోగా, ధ్యానాన్ని ప్రతిరోజు జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

పంటనష్టం పరిశీలన

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో కేవికే శాస్త్రవేత్తలు డా.శిల్పకళ, డా.మానస వేంపల్లి, వేముల, పెండ్లి మర్రి మండలాల్లో ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డా.శ్రీవల్లి, డా.సుబ్రమణ్యం బృందం పర్యటించారు. నందిమండలం, ఇడుపులపాయ, కుమ్మరంపల్లి, గొల్లలగూడూరు గ్రామాలలో మండల వ్యవసాయ అధికారులతో కలిసి వరి, మినుము, చీనీ, మామిడి తోటలను పరిశీలించారు. అనంతరం వారు వివిధ పంటల్లో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. అధిక వర్షాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు.

శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శించిన తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లి టీచర్స్ కాలనీకి చెందిన కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి అనారోగ్యంతో ఉన్నారు. రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీయుతులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, చిన్నకోట్లనాగరాజు ,ఐచర్ రమణ గురువారం శ్రీనివాస్ రెడ్డిని పరామర్శించారు .త్వరగా కోలుకోవాలని వారు కోరారు.

అన్నదానం

విశాలాంధ్ర-వేంపల్లి: స్థానిక పాతగండి రోడ్డులోని మదర్‌థెరిసాలో గురువారం ఆశ్రమవాసులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచు రాచినేని శ్రీనివాసులు జన్మదినం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైసిసి మాజీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాచినేని వేణుగోపాల్, జిల్లా నేత కసిరెడ్డి ఆదినారాయణ రెడ్డి, పుల్లయ్యతోట నగేష్, బ్రహ్మానంద కుమార్, భూషణం, ఆదినారాయణ, వార్డు సభ్యుడు సునిల్, లోకేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికక్షేత్రాలు ప్రశాంతతకు నిలయాలు

విశాలాంధ్ర-పులివెందుల: ఆధ్యాత్మిక క్షేత్రాలు ప్రశాంతికి నిలయాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త తులసిరెడ్డి అన్నారు. గురువారం పులివెందుల మండలం ఎర్రబల్లె కొత్తపల్లి గ్రామంలో శ్రీకోదండ రామాలయంలో పులివెందుల భాగవత భక్త సమాజం ఆధ్వర్యంలో భాగవత సప్తాహం కార్యక్రమం నిర్వహించారు. రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తులసి రెడ్డి మాట్లాడుతూ అంగట్లో అన్ని ఉన్నా అల్లుని నోట్లో శని ఉంది అన్నట్లు ఆధునిక మానవుడు అన్నీ ఉండి కూడా అశాంతితో అలమటిస్తున్నాడని అన్నారు. కార్యక్రమంలో భాగవతులు తేరా పులారెడ్డి, యాగంటి బాలకృష్ణారెడ్డి, నాగ సుందర్ రెడ్డి, బాల గంగిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, చిన్నశివారెడ్డి, పాపిరెడ్డి, నారాయణ రెడ్డి, గంగిరెడ్డి, నారాయణ రెడ్డి, రంగనాథం, రామ సుబ్బారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, చిన్నకోట్ల నాగరాజు, ఐచర్ రమణ, భాగవతులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాల్సిందే

విశాలాంధ్ర-మైలవరం: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసే విధానాన్ని ఉపసంహరించుకోవాల్సిందేనని వైసిపి జమ్మలమడుగు నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శి రామాంజనేయులు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ భాగం గా గత రెండు రోజులుగా మండలంలోని వద్ది రాల గ్రామంలో ప్రజల సమక్షంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణని వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రామంజి నేయులు మాట్లాడుతూ ప్రజలే స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేయడం హర్షనీయమన్నా రు. రాష్ట్రములోని 10మెడికల్ కాలేజీలు ఎం దరో సీఎంలు ఉన్నప్పుడు తీసుకొచ్చారని ఐదేళ్ల పరిపాలనలో 17 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చిన ఘనత మాజీ సీఎం జగన్ కే చెందుతుందని తెలిపారు. పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్య నాణ్యతగా అందాలని భావించి 8,480 కోట్లతో మెడికల్ కాలేజీలను నిర్మాణాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్ రెడ్డి ప్రారంభించడం జరిగిందని కానీ కూటమి ప్రభుత్వం కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.వెంటనే ప్రైవేటీకరణ జీవోను ఉపసంహరించుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నక్కవాని పల్లె, దొడియం, వద్దిరాల, బెస్తవేముల గ్రామాల సోషల్ మీడియా ప్రతినిధి ఓబుల్ రెడ్డి, కార్యకర్తలు సురేష్ రెడ్డి, నరేష్, శేఖర్ పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్ష కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర-చిట్వేల్: మార్చిలో జరగబోవు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పరీక్ష కేంద్రాల ఏర్పాటు వసతులకు సంబంధించి చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా ఉప విద్యాశాఖ అధికారి,జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రాజు, సూపర్డెంట్ రవి,ఉపాధ్యాయుడు ఆదినారాయణ రెడ్డి,మండల విద్యాశాఖ అధికారులు ఎంఈవో-1 ఖాజా మొహిద్దీన్, ఎంఈవో-2 ఈశ్వరయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గ రాజు కలిసి సందర్శించాడు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు పరీక్ష రాసేందుకు మౌలిక సదుపాయాలు పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్ ,కాలేషా, మహేశ్వర, వెంకటసుబ్బయ్య, సతీష్, సిఆర్ఎంటీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జీవన వికాసానికి పరిశుభ్రత ఎంతో ముఖ్యం

విశాలాంధ్ర-వేంపల్లి: జీవన వికాసానికి పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని ప్రధానోపాధ్యాయురాలు షమీనాభాను అన్నారు. స్థానిక వైఎస్సార్ వివేకానంద డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్-1 ఆధ్వర్యంలో పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రపరచి సుమారు రెండు వందల మొక్కలను నాటారు. అనంతరం పర్యావరణ సమతుల్యత తదితర అంశాలను వివరించారు.ఆమె మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పరిసరాల పరిశుభ్రతలో పాలి భాగస్తులగుట అది ఎంతో సంతోషదాయకమని, ఈ కార్యక్రమం వలన వ్యక్తిత్వ జీవన వికాస అభివృద్ధి జరుగుతుందన్నారు. ముఖ్య నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, టీచర్ రాఘవరెడ్డి, విజయలక్ష్మి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వాలంటీర్ల శ్రమదానం

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లి మండలం ఆర్జీయూకేటీ పరిధిలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం నాల్గవ రోజు కొనసాగింది. మండల పరిధిలోని చింతలమడుగుపల్లె, ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లి గ్రామాలల్లో మొక్కలు నాటారు. నిషేదిత ప్లాస్టిక్ వస్తువు వినియోగంపై కలిగే నష్టాలను వివరించారు. అలాగే మహిళా సాధికారత గురించి విశదీకరించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి డాక్టర్ రవికుమార్, ప్రోగ్రామ్ అధికారులు రత్నకుమారి, కోనప్ప, వాలంటీర్లు పాల్గొన్నారు.